Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

PRAJA TELEVISION
The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను
సపోర్ట్ చేయండి
8309979541


ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 179 | హైదరాబాద్ | శనివారం 23 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# అధికారమే లక్ష్యం

## ప్రణాళికలు రచిస్తున్న బీఆర్ఎస్



ఈసారి వ్యూహాత్మక అడుగులు

జిల్లాలపై ప్రత్యేక ఫోకస్

కేటగిరీలుగా విభజించి వ్యూహాలు

పార్టీ నిర్మాణం.. ప్రజాసమస్యలపై పోరాటం చేయాలని నిర్ణయం

**ఈ దఫా వ్యూహాత్మకంగా ప్రాంతాలను ఎంచుకుని, ఉమ్మడి జిల్లాలవారీగా పావులు కదుపుతోంది. ఈ మేరకు నాయకత్వం అంతర్గతంగా లక్ష్యం చేసుకున్న ఆయా జిల్లాల పై ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోంది. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలలలో మూడు కేటగిరీలుగా ఎంచుకున్న మూడు ప్రాంతాల పైన ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది.**

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేందుకు గులాబీ దళం ఇప్పటి నుంచే శ్రమిస్తోంది. ఫామ్ హౌస్ నుంచి ఫాంలోకి వచ్చిన మాజీ సీఎం కేసీఆర్ పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. తాజాగా పార్టీలో సభత్వ నమోదు సందడి నెలకొంది. ఈసారి డిజిటల్ పద్ధతిలో సభ్యత్వ నమోదు చేస్తున్నారు. ఇదే క్రమంలో రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీఆర్ఎస్ తిరిగి పట్టు సాధించేందుకు గట్టి ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ దఫా వ్యూహాత్మకంగా ప్రాంతాలను ఎంచుకుని, ఉమ్మడి జిల్లాలవారీగా పావులు కదుపుతోంది. ఈ మేరకు నాయకత్వం అంతర్గతంగా లక్ష్యం చేసుకున్న ఆయా జిల్లాల పై ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తోంది. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాలలలో మూడు కేటగిరీలుగా ఎంచుకున్న మూడు ప్రాంతాల పైన ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది. ఇక్కడ పార్టీ నిర్మాణం, ప్రజా సమస్యల పై పోరాటం, ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే ప్రజా కార్యక్రమాలు చేపట్టే విధంగా కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ఈ మూడు ప్రాంతాలు తొలి నుంచి పార్టీకి పట్టుగొమ్మగా, ఆటుపోట్లు, అడ్డంకుల సమయంలో వెనుదన్నుగా నిలిచి పదేండ్ల అధికారం సమయంలో చేసిన పొరపాట్లు, తప్పులకు

- మిగతా 2వ పేజీలో



## సైప్రస్‌తో సుదృఢ బంధం

భారత్-సైప్రస్ వ్యూహాత్మక భాగస్వామ్యం

రక్షణ సహకారంలో ఐదేళ్ల రోడ్‌మ్యాప్ ఆవిష్కరణ

మోదీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ భేటీ

ఆరు ఒప్పందాలపై ఇరుదేశాల సంతకాలు

2లో





## నీట్‌కు వయో పరిమితి?

పరీక్ష రాసేందుకు కూడా కట్టడి

ఇకపై 'ఎన్నిసార్లయినా' కుదరదు

కఠిన నిర్ణయాలు తప్పవు: ధర్మేంద్ర

పేపర్ లీక్ కాలేదు.. గెస్ పేపర్‌లోని ప్రశ్నలే పరీక్షలో వచ్చాయి: ఎన్‌టీఏ

మాఫియాతో సర్కార్ కుమ్మక్కు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, మే 22: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)- 2026 ప్రశ్నపత్రం లీకైన నేపథ్యంలో ఈ పరీక్షకు సంబంధించి కేంద్రం కీలక మార్పులు చేసే దిశగా అడుగులు వేస్తున్నట్టు తెలిసింది. నీట్ రాసే అభ్యర్థులకు

- మిగతా 2వ పేజీలో





## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

విద్యా వ్యవస్థల్లో జవాబుదారీ ఉండాలి

మా ఆన్‌లైన్ పిటిషన్‌కు మద్దతివ్వండి

ప్రజలకు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వినతి

న్యూఢిల్లీ: నీట్(యూజీ)-2026 పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పారటె డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియాలో పోరాటం ఆరంభించింది. ఆ పార్టీ 'ఎక్స్'ఖాతాలను ప్రభుత్వం నిలిపివేయడంతో 'కాక్రోచెస్ నెవర్ డై'అనే ట్యాగ్‌లైన్‌తో 'కాక్రోచ్ ఈజ్ బ్యాక్'పేరిట కొత్త ఖాతాను సృష్టించుకుంది. ఇదే ఖాతా నుంచి పోస్టులు చేస్తోంది. చురుగ్గా వ్యవహరిస్తోంది. విద్యా రంగంలో

- మిగతా 2వ పేజీలో



## ఫ్యూచర్ సిటీ రద్దు

మా ప్రభుత్వం రాగానే ఫార్మాసిటీ రీస్టోర్ చేస్తాం

ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం: హరీష్‌రావు

హైదరాబాద్, మే 22 (ప్రజాతీర్పు)

బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్యూచర్ సిటీ రద్దుచేస్తామని మాజీమంత్రి హరీష్‌రావు స్పష్టంచేశారు. ఆ భూముల్లో ఫార్మా సిటీకే కేంద్ర పర్యా వరణ శాఖ అనుమతి ఇచ్చిందని, డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని పార్లమెంట్ చట్టం ఉందని గుర్తుచేశారు. అమెరికా పర్యటనలో ఉన్న హరీష్‌రావు శుక్రవారం అక్క డ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు. రేవంత్ ప్రభు త్వం ఫ్యూచర్ సిటీ అని కేవలం డ్రామా చేస్తోందని విమర్శించారు. హైకోర్టులో ఈ మధ్య ఒక కేసు వచ్చిందని, ఫార్మా సిటీ కంటిన్యూ చేస్తున్నామని రేవంత్ ప్రభుత్వం కోర్టుకు

- మిగతా 2వ పేజీలో





రైతన్న అజెండాగా

## కేబినెట్లో చర్చించండి

పంట కొనుగోళ్ల పై శ్వేతపత్రం విడుదల చేయాలి

కొనుగోళ్లు 80% పూర్తి అయితే ఏ శిక్ష కు అయినా సిద్ధం

మాజీ మంత్రి కేటీఆర్

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

రాష్ట్రంలో పంట కొనుగోళ్ళ సంక్షోభం తీవ్రంగా ఉన్నదని, దీన్ని పట్టించుకోకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులంతా అవాస్తవాలు చెప్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలోని అన్నదాతల పరిస్థితి పైన, పంట కొనుగోళ్ళ సంక్షోభం పైన తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన మీడియా

- మిగతా 2వ పేజీలో

## 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

తెలంగాణ వృద్ధి రేటు 10.7 శాతం... దేశ సగటు కంటే వేగంగా వృద్ధి రేటు

విద్యార్థుల రుణాలు.. పెట్టుబడులు

బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్ : 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఇది పెద్ద కల అని, రాష్ట్ర ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది కచ్చితంగా సాధ్యమేనని స్పష్టమౌతోందన్నారు. ప్రస్తుతం దేశ సగటు ఊవృద్ధి రేటు 8.2% గా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు10.7%తో దూసుకుపోతోందన్నారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని ప్రకటించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లకు, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకుందన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగడం గొప్పవిషయమన్నారు. వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.1,65,297 కోట్ల లక్ష్యానికిగాను రూ.1,68,401 కోట్లు పంపిణీ చేసి 101.88 శాతం సాధించడం గర్వించదగ్గ విషయమని

- మిగతా 2వ పేజీలో



2లో

## బీజేపీ పోరుబాట

25 నుంచి రైతు ఘోష..

కమలం పార్టీ భరోసా కార్యక్రమం

మూడురోజులపాటు పంట కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్న పార్టీ రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

## కుర్చీలాట..!



మంత్రిపదవులు ఉండేనా?

కేంద్రంలో.. రాష్ట్రంలో అమాత్యుల టెన్షన్

కొత్త వారిలో ఆశలు.. రాష్ట్రంలో ముగ్గురికి స్థానచలనం

కేంద్రంలో అదే సామాజికవర్గానికి స్థానం.. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గం రేసులో పలువురు

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

ఇటు రాష్ట్రంలో.. అటు కేంద్రంలోని అమాత్యులకు బుగ్గ కార్ల టెన్షన్ పట్టుకున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. రెండు చోట్ల మంత్రివర్గ విస్తరణ, కొత్త వారికి అవకాశం కల్పిస్తారనే ప్రచారం నేపథ్యంలో తమ పదవులు ఉంటాయా? లేదా అన్న అనుమానం వారిని పీడిస్తోంది. ఇదే క్రమంలో ఎంతో కాలంగా కుర్చీపై కన్నేసిన పలువురు నేతలు ఈసారి అయినా తమకు పరిస్థితి అనుకూలిస్తుందా.. పదవి వస్తుందా అన్న టెన్షన్‌లో ఉన్నట్లు సమాచారం. మొత్తంగా కేంద్రంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వారికి.. రాష్ట్రంలోని ఓ ముగ్గురికి స్థాన చలనం తప్పదని జోరుగా ప్రచారం జరుగుతుంది. కేంద్రమంత్రి వర్గ సమావేశం తాజాగా గురువారం జరిగింది. రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కేంద్ర మంత్రులకు ఇవే చివరి కేబినెట్ సమావేశాలు అని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తర్వలోనే వారి స్థానంలో కొత్త మంత్రులు వస్తారని ఆ పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నారు. ఇక రాష్ట్రంలో ఈ నెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ముగ్గురికి చివరి సమావేశం అన్న ప్రచారం జరుగుతుంది.పని తీరు ఆధారంగా ఆ ముగ్గురు మంత్రులకు ఉద్వాసన పలికి, కొత్త వారికి అవకాశం కల్పిస్తారని అంటున్నారు. ఈ మేరకు నిర్ణయం కూడా తీసుకున్నారని, దానిని అమలు చేయడమే మిగిలి ఉందని అంటున్నారు. దీంతో తెలంగాణ రాజకీయాలు వేడెక్కాయి. తమ పదవులను

- మిగతా 2వ పేజీలో

# కుర్చీలాట...!

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుకునేందుకు ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న వారు తమ తమ ప్రయత్నాలు చేస్తుండగా, కొత్తగా అవకాశం కోసం చూస్తున్న వారు ఒక్కఛాన్స్ ప్లీజ్ అంటు తమ గాడ్ ఫాదర్ల చుట్టూ తిరుతున్నారు.

### ఐదు మంత్రి పదవుల భర్తీ?

తెలంగాణ మంత్రివర్గ ప్రక్షాళనలో భాగంగా పలువురు మంత్రులకు ఉద్వాసన తప్పదనే టాక్ ఎప్పటినుంచో వినిపిస్తోంది. మరికొందరి శాఖల మార్పులు ఉంటాయనే చర్చ ఉంది. సామాజిక సమీకరణాల ఆధారంగా..పనితీరు ఆధారంగా ఇద్దరు, ముగ్గురు మంత్రులను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇక క్యాబినెట్‌లో ఇప్పటికే ఖాళీగా ఉన్న రెండు బెర్తులను కూడా భర్తీ చేసే ఛాన్స్ ఉందట. మొత్తంగా ఐదు మంత్రి పదవుల భర్తీ జరగనుందనేది కాంగ్రెస్ నేతల అంచనా. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆది శ్రీనివాస్, రామచంద్రునాయక్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్‌తో పాటు బీర్ల అయిలయ్య, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, విజయశాంతి పేర్లు మంత్రివర్గ రేసులో బలంగా వినిపిస్తున్నాయి. కేంద్ర క్యాబినెట్‌లో తెలంగాణ నుంచి క్యాబినెట్ ర్యాంక్‌తో ఇద్దరు ఉన్నారు. జాతీయ ప్రయోజనాలు.. రాష్ట్రంలోని పార్టీ అవసరాలను దృష్టిలో పెట్టుకొని కేంద్రమంత్రి వర్గంలో మార్పులు, చేర్పులు చేస్తారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఇప్పుడున్న కేంద్ర మంత్రులు పార్టీకి పని చేసేలా చేసి.. వారి స్థానాల్లో కొత్త వారికి అవకాశాలు ఇస్తారని కమలం పార్టీలో జోరుగా చర్చ నడుస్తోంది. అయితే వారిని తప్పిస్తే..వారి స్థానంలో..అదే సామాజికవర్గానికి చెందిన నేతలకు చోటు కల్పిస్తారని అంటున్నారు. కేంద్ర మంత్రిపదవుల రేస్‌లో డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ధర్మపురి అరవింద్, ఈటెల రాజేందర్‌లు ఉన్నారు. మొత్తంగా కేంద్ర, రాష్ట్రస్థాయిలో బుగ్గకారు మంత్రులను టెన్షన్ పెడుతోంది. మరి ఆయా ప్రభుత్వాలు, పార్టీల అధిష్ఠానాలు ఏం చేస్తాయో వేచి చూడాల్సిందే.

# ఫ్యూచర్ సిటీ రద్దు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పిందన్నారు. రేవంత్ సర్కా ర్ కేవలం జిమ్మిక్కు చేస్తోందని, ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీససౌకర్యాలు, ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. 75 శాతం ఫార్మా సిటీ ఉండి మిగతా 25 పర్సెంట్ మిగతావి ఉండేలా చేస్తే, కానీ 75 శాతం మిగతా వ్యా పారం 25 శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. ఇది చట్ట ప్రకారం చెల్లద ని స్పష్టంచేశారు. కానీ కాంగ్రెస్ ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోకి వచ్చాక ఫ్యూచర్ సిటీ రద్దు వందశాతం చేస్తామని తేల్చి చెప్పారు. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని, ఇది నా మాట కాదని, పార్లమెంట్ చట్టం ఇదే చెబుతుందని వెల్లడించారు. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని, లక్షల కోట్ల వ్యాపా రం జరిగి రాష్ట్ర ఎకానమీ పెరుగుతుందని ప్రారంభించామని, మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని భావించామని గుర్తుచేశారు. ఇప్పటికే రెండున్నర ఏళ్లు గడిచిపోయిందని, లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుందన్నారు. ఇప్పటివరకు రేవంత్ సర్కార్ ఏమీచేయలేదని, భూములు పంచిపెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధిపొందాలని ప్లాన్ చేశారని ఆరోపించారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్‌ఎస్‌కు పేరు వస్తుం ది అనే ఆలోచనతోనే ఇలా చేశారని మం డిపడ్డారు. వాళ్లు ఏమి చేసినా నడవదు, నిలబడదన్నారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటే వస్తుందని స్పష్టంచేశారు.

# నీట్‌కు వయో పరిమితి?

(మొదటి పేజీ తరువాయి)

వయోపరిమితి విధించడంతోపాటు ఎన్ని సార్లయినా రాసేందుకు ఇకపై అనుమతించకపోవచ్చని సమాచారం. ఈ విషయంపై సిఫారసు చేయనున్నట్టు కేంద్ర ప్రభుత్వం.. పార్లమెంటరీ స్థాయీ సంఘానికి తెలిపింది. అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు పరిమితి విధించనున్నట్టు పేర్కొంది. ఈ క్రమంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్.. గురువారం కాంగ్రెస్ పార్టీ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలో స్థాయీ సంఘం ముందు హాజరయ్యారు. నీట్-యూజీ పేపర్ లీకైన నేపథ్యంలో భవిష్యత్తులో ఈ పరీక్ష నిర్వహణకు సంబంధించి తీసుకురానున్న సంస్కరణలను వివరించారు. ప్రధానంగా మూడు దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించినట్టు సింగ్ వివరించారు. అయితే, ఇటీవల జరిగింది.. 'పేపర్ లీక్' కాదని, గెస్ పేపర్‌లో వచ్చిన ప్రశ్నలే వాస్తవ ప్రశ్న పత్రంలో కనిపించాయని ఆయన సమర్థించుకోవడం తీవ్ర వివాదానికి దారితీసింది.

### పెన్ పేపర్ బదులుగా కంప్యూటర్

పేపర్-పెన్ ఆధారిత పరీక్ష స్థానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష. బహుళ దశల్లో పరీక్షను నిర్వహించడం. ప్రస్తుతం ఒకే దశ(షిఫ్ట్)లో పరీక్షను నిర్వహిస్తున్నారు. పరీక్షకు హాజరయ్యేవారికి వయోపరిమితి, పరీక్షలు రాసే సంఖ్యపై పరిమితి విధించడం. ప్రస్తుతం 17 ఏళ్లు నిండిన వారు పరీక్ష రాసేందుకు అర్హులు. గరిష్ఠ వయోపరిమితి లేదు. అదేవిధంగా నీట్ పరీక్షను ఎన్నిసార్లయినా రాయొచ్చు.

# సైప్రస్‌తో సుదృఢ బంధం

## మోదీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ భేటీ

న్యూఢిల్లీ: భారత్, సైప్రస్ దేశాల మధ్య బంధం మరింత బలోపేతం కానుంది. ఇరుదేశాలు తమ సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లాయి, వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకున్నాయి. రక్షణ సహకారం విషయంలో ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించాయి. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలైడ్స్ శుక్రవారం ఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, పరస్పర సహకారంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీ, విద్య, సంస్కృతి తదితర రంగాల్లో సహకారం కోసం ఇరుదేశాలు ఆరు ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఉగ్రవాదాన్ని అరికట్టడానికి ఒక సంయుక్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసే ఒప్పందం కూడా ఇందులో ఉంది. వలసలపై ఒక సమగ్ర భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని భారత్, సైప్రస్ నిర్ణయించుకున్నాయి.

### కాలపరీక్షకు నిలిచిన స్నేహబంధం

వ్యాపారం, వాణిజ్యం, పెట్టుబడులు, నూతన సాంకేతికతలు, విద్య వంటి రంగాల్లో సంబంధాలతోపాటు ఇండియా--మిడిల్ ఈస్ట్--యూరప్ ఎకనామిక్ కారిడార్ అమలుపై నరేంద్ర మోదీ, నికోస్ క్రిస్టోడౌలైడ్స్ చర్చించుకున్నారు. ఈ భేటీ అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం సైప్రస్‌లోని మౌలిక సదుపాయాలు, ఇంధనం, వ్యవసాయ రంగాల్లో భారతీయ కంపెనీలకు వాణిజ్య మూలధనాన్ని అందుబాటులోకి తెచ్చి, కొత్త మార్గాలను తెరుస్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో భారతదేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న షిప్పింగ్, సముద్ర పరిశ్రమల్లో పెట్టుబడులను పెంచుతుందని వెల్లడించారు. 'భారత్, సైప్రస్ స్నేహబంధం ఎన్నోసార్లు కాలపరీక్షలకు నిలిచిందని గుర్తుచేశారు. ఈ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలన్న నిర్ణయంతో ఇరుదేశాల బంధానికి కొత్త ఆశయాలను, కొత్త ఊపును ఇవ్వబోతున్నామని పేర్కొన్నారు. అలాగే సైబర్ సెక్యూరిటీ డైలాగ్‌ను ఏర్పాటు చేసుకోబోతున్నట్లు రెండు దేశాలు ప్రకటించాయి. భారత్--యూరప్ సంబంధాలు మెరుగుపడటాన్ని మోదీ ప్రస్తావించారు. అవి ఒక కొత్త స్వర్ణయుగంలోకి ప్రవేశించాయని అన్నారు. మౌలిక సదుపాయాలు, నౌకా రవాణా వంటి కీలక రంగాల్లో సహకారం కోసం భారత్, సైప్రస్‌లు ఒక సంయుక్త టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించాయని నికోస్ క్రిస్టోడౌలైడ్స్ తెలియజేశారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళికంగా రాజకీయ అనిశ్చితి నెలకొన్న ఈ తరుణంలో యూరోపియన్ యూనియన్ (ఈయూ), భారత్ మధ్య భాగస్వామ్యం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

# కేబినెట్లో చర్చించండి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటిదాకా చేసిన పంట కొనుగోళ్ళ పైన, పంటల వారీగా ఒక శ్వేతపత్రం... లెక్కలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో స్వయంగా పర్యటించిన తాను, కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న రైతన్నల దుస్థితిని చూసిన తర్వాత ప్రభుత్వానికి నిన్న ఒక బహిరంగ లేఖ రాస్తే... ముఖ్యమంత్రితో పాటు మంత్రి అబద్దాలు, అటెన్షన్ డైవర్షన్ ముచ్చట్లు చెప్పారని కేటీఆర్ మండిపడ్డారు. కనీసం రేపు జరిగే క్యాబినెట్ సమావేశంలోనైనా అత్యంత కీలకమైన ఈ పంట కొనుగోళ్ళ సంక్షోభం పైన చర్చించాలని, రైతన్నల కష్టాలే ఏకైక ఎజెండాగా రేపటి క్యాబినెట్ సమావేశం నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మరోవైపు అన్నదాతల ఆత్మహత్యల పైన, మరణాల పైన ప్రభుత్వానికి సమాచారం ఇస్తే... సివిల్ సప్లైస్ మంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా 'ఎవరూ చనిపోలేదు' అని బుకాయిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అవసరమైతే పంట కొనుగోళ్ళు ఆలస్యమై, నష్టపోయిన రైతన్నలు మరణాల పాలయ్యారని, వారి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు రాష్ట్రవ్యాప్తంగా రైతులు స్వచ్ఛందంగా రోడ్లెక్కి ఆందోళనలు చేస్తున్నారని, ధర్నాలు చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. ఆరుగాలం పండించి తీసుకువచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకి తరలిస్తే... కనీసం వాటిని కాంటా పెట్టడం లేదు. కాంటా పెట్టిన సందర్భంలోనూ భారీగా తరుగు తీసి దోపిడీకి గురి చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ నియోజకవర్గంలో కూడా రైతన్నలు పంట కొనుగోళ్ళ అంశంలో నిరసన తెలిపిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. అయితే గన్నీ బ్యాగుల నుంచి మొదలుకొని సుతలి దారం వరకు ప్రతి అంశంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో గన్నీ బ్యాగులు దొరకడం లేదు కానీ గన్నులు మాత్రం విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, ఈ మధ్య జరిగిన దాడులను, అరాచకాలను కేటీఆర్ ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు... ప్రతిపక్షంగా భారత రాష్ట్ర సమితి ఇస్తున్న సమాచారాన్ని, సలహాలను తీసుకొని పంట కొనుగోలు సంక్షోభాన్ని గుర్తించాలని, మొద్దు నిద్ర నుంచి మేల్కోవాలని కేటీఆర్ అన్నారు. 'కేవలం అధికారంలో ఉన్నాము కాబట్టి కింద ఉన్న సమస్యను పట్టించుకోము, ఎవరు చెప్పినా వినము' అనే మూర్ఖత్వంతో వ్యవహరించవద్దని కేటీఆర్ సూచించారు. పంట కొనుగోళ్ళకు సంబంధించిన అంశంలో ముఖ్యమంత్రేమో



'80 శాతం పంట కొనుగోళ్ళు పూర్తయ్యాయి' అని, మంత్రులేమో '50 శాతం పూర్తయ్యాయి' అని అడ్డగోలు ప్రకటనలు చేస్తున్నారని, కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కనీసం 30 శాతం కొనుగోళ్ళు కూడా పూర్తి కాలేదని కేటీఆర్ అన్నారు. పదేళ్ళు దేశానికి అన్నపూర్ణగా వెలుగొందిన తెలంగాణ రాష్ట్రం ఈ రోజు రైతన్నల కన్నీళ్ళతో తల్లడిల్లుతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత యూరియా దొరకదు, రైతుబంధు దొరకదు, రుణమాఫీ దొరకదు... చివరికి పండించిన పంట అమ్ముకుందామంటే కూడా సౌకర్యాలు దొరకవని, అన్న పరిస్థితి నెలకొందని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం పంట కొనుగోళ్ళను ఆలస్యం చేస్తే ఎవరో ఒక బ్రోకర్ కి రైతులు తోచిన ధరకి అమ్ముకుంటారు అన్న ప్రభుత్వ పాలసీ స్పష్టంగా కనిపిస్తున్నదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు బుకాయింపులు, బెదిరింపులు, హుంకరింపులు, అబద్ధాలతో కాలం నెట్టుకురాకుండా ఉన్న సంక్షోభాన్ని గుర్తించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం చెప్పిందే నిజమైతే మా పార్టీ తరఫున ఏ కొనుగోలు కేంద్రానికైనా వస్తామని, క్షేత్రస్థాయి సమస్యలు తెలుసుకుందామన్నారు. ఎక్కడైనా ముఖ్యమంత్రి చెప్పినట్లు 80శాతం కొనుగోళ్ళు పూర్తయ్యాయని నిరూపిస్తే ఏ శిక్షకైనా తాము సిద్ధమని ముఖ్యమంత్రికి కేటీఆర్ సవాలు విసిరారు. ఇప్పటికైనా పంతాలకు పోకుండా రైతన్నల కోసం అండగా నిలబడాలని కేటీఆర్ ప్రభుత్వానికి సూచించారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పంట కొనుగోళ్ళ అంశం పైన స్పందించి, తగిన చర్యలు తీసుకోకుంటే... రైతన్నలకు సమస్యలను పట్టించుకోకుంటే, పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువస్తామని కేటీఆర్ తెలిపారు. లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తూనే ఉంటామని కేటీఆర్ హెచ్చరించారు."

# అధికారమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విధించిన శిక్షగా భావించి వాటిని సరిదిద్దుకునేయత్నం చేస్తున్నట్లు భావిస్తున్నారు. ఈ మేరకు ఈ మూడు జిల్లాల నాయకత్వానికి ప్రత్యేక లక్ష్యాలు నిర్దేశించి అమలు చేస్తున్నట్లుగా ఆ పార్టీ వర్గాల్లో విస్తృత చర్చసాగుతోంది.

### ప్రాంతాల వారీగా ఫోకస్

బీఆర్‌ఎస్ కు పదేండ్ల పాలన తర్వాత గత అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం తెలంగాణ వ్యాప్తంగా ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ ఉమ్మడి హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి, దాని పరిసర జిల్లాలు పార్టీకి ప్రాణం పోశాయి. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి 39 మంది ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. ఇందులో దాదాపు 20కి పైగా స్థానాలు ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే గెలుపొందారు. మిగిలిన 19 మంది ఇతర జిల్లాల్లో విజయం సాధించారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకున్న తర్వాత పార్టీ ప్రధాన నాయకత్వం ప్రత్యేక ప్రణాళికను రచించి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు మూడు ప్రాంతాలను ఎంపిక చేసుకుని, ఇక్కడ మూడు రకాల ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నట్లు చర్చసాగుతోంది. ఎంపిక చేసిన ఈ మూడు ప్రాంతాల్లో పట్టు నిలుపుకుంటే దాదాపు 50కి పైగా స్థానాల్లో గెలిచి తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చినట్లేనని, రాష్ట్రంలో మిగిలిన ప్రాంతాల పై వీటి ప్రభావం ఉంటుందనే లక్ష్యంతో ప్రణాళికను చాకచక్యంగా అమలు చేస్తున్నట్లుగా సమాచారం. ఈ మూడు ప్రాంతాలు కాకుండా మిగిలిన ప్రాంతాల్లో సాధారణ పార్టీ కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగితే వచ్చే ఫలితాలు చాలని, ఈ మూడు ప్రాంతాలు మాత్రం అత్యంత కీలకమైనవిగా ఎంచుకున్నట్లు చర్చసాగుతోంది. దీని కోసం పార్టీకి మూడు స్థాయిల్లోని జిల్లాలు, గతంలో అక్కడ పార్టీ పట్టు, కష్టసమయాల్లో ఆయా జిల్లాల పాత్రను పరిగణలోకి తీసుకుని ఈ ఎంపిక చేసినట్లుగా సమాచారం.

### సమస్యలపై పోరాటాలు..

బీఆర్‌ఎస్ సమస్యలే ఏజెండాగా పోరాటం చేస్తోంది. ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యాలను పార్టీ ఎడగడుతూ ప్రజల్లోకి, ముఖ్యంగా రైతుల్లోకి వెళ్తోంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితిని, ప్రస్తుత పరిస్థితిని బేరీజు వేసి చూపిస్తూ రైతులకు దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇక పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్రలకు సన్నాహం కావడం కూడా ఈ వ్యూహంలో భాగంగానే అంటున్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. శుక్రవారం ప్రజాభవన్‌లో 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళ, దళిత, గిరిజన యువ పారిశ్రామికవేత్తలకు రుణాల పంపిణీపై బ్యాంకులు మరింత దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానళ్ల ఏర్పాటు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్టు భట్టి వెల్లడించారు. ఇప్పటికీ వ్యవసాయ రుణాల్లోఅధిక భాగం స్వల్పకాలిక పంట రుణాలకే బ్యాంకులు పరిమితం కావడం ఆందోళన కలిగించే విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయం ఇప్పుడు ఉద్యానవనం, ఆయిల్ పామ్, సమగ్ర వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షిత సాగు, పాడి, మత్స్య, యాంత్రీకరణ వంటి రంగాల వైపు వేగంగా మారుతున్న నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ఇందుకు అనుగుణంగా స్పందించాలని కోరారు. గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీలు, ప్యాక్ హౌస్‌లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, డ్రిప్ ఇరిగేషన్, సోలార్ వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ వంటి రంగాలకు దీర్ఘకాలిక పెట్టుబడి రుణాలు అందించాలని సూచించారు. 2025--26 లో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరి, వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంలో 84.34 శాతం సాధించిందన్నారు. మొత్తం వ్యవసాయ, అనుబంధ రంగాలు, మౌలిక వసతుల కింద రూ.1,68,401 కోట్ల రుణాలు పంపిణీ చేసి 101.88 శాతం లక్ష్య సాధన నమోదు కావడం రాష్ట్ర బ్యాంకింగ్ వ్యవస్థ పురోగతిని సూచిస్తోందన్నారు. శుక్రవారం 49వ రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) త్రైమాసిక సమావేశంలో మంత్రి బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు, సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రధాన రంగ రుణాలు రూ.4.09 లక్షల కోట్లు, వ్యవసాయ రుణాలు రూ.1.87 లక్షల కోట్లకు చేరడం సంతోషకరమన్నారు. పీఆర్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్‌బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం దారుణంగా విఫలమైందని, పరీక్షలు సైతం సక్రమంగా నిర్వహించలేకపోతోందని సీజేపీ ఆగ్రహం వ్యక్తంచేసింది. ధర్మేంద్ర ప్రధాన్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ ఆన్‌లైన్‌లో పెట్టిన పిటిషన్‌కు మద్దతు ఇవ్వాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కోరారు. తాజాగా ఒక వీడియో సందేశం పోస్టుచేశారు. "బొద్దింకల్లారా.. ఎలా ఉన్నారు? ఇంటర్నెట్‌లో మీరంతా బాగా రాణిస్తున్నారని అందరూ అంటున్నారు. కానీ ఇప్పుడు నిజమైన పని చేయాల్సిన సమయం వచ్చింది. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఈ రోజు ఆన్‌లైన్‌లో ఒక పిటిషన్‌ను ప్రారంభిస్తున్నాం. దీనికి అందరూ మద్దతివ్వాలి"అనికోరారు. విద్యా వ్యవస్థలోని వైఫల్యాలు విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. అందుకే జవాబుదారీతనం ఉండాలన్నారు. అందుకు సమయం వచ్చిందన్నారు. 22 లక్షలకు పైగా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినడానికి, నీట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడానికి వ్యవస్థే కారణమని ఆరోపించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని అభిజిత్ దీప్కే తేల్చిచెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తనకు బెదిరింపులు కూడా వచ్చాయని పేర్కొన్నారు. చంపేస్తామంటూ హెచ్చరిస్తున్నారని చెప్పారు.

### దీప్కే భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన

కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే భద్రతపై ఆయన తల్లిదండ్రులు భగవాన్, అనితా దీప్కే ఆందోళన చెందుతున్నారు. తమ కుమారుడి ప్రాణాలకు ఎవరైనా ముప్పు తలపెట్టే ప్రమాదం ఉందని అనుమానిస్తున్నారు. ఆ పార్టీకి సోషల్ మీడియాలో విపరీతమైన ఆదరణ లభిస్తోంది. పార్టీ ఎక్స్ ఖాతాను ప్రభుత్వం నిలిపివేసింది. మరోవైపు అభిజిత్‌కు బెదిరింపులు సైతం వస్తున్నట్లు తెలుస్తోంది. తమ కుమారుడు ఇబ్బందుల్లో పడతాడేమో లేక అరెస్టును కూడా ఎదుర్కొంటాడేమోనన్న భయంతో తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. అభిజిత్‌కు ఆమ్ ఆద్మీ పార?టతో సంబంధాలున్నాయి. అతడి తల్లిదండ్రులు మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో నివసిస్తున్నారు. తమ బిడ్డ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం తమకు ఎంతమాత్రం ఇష్టం లేదని వారు చెప్పారు. అతడి భద్రత పట్ల ఆందోళన చెందుతున్నామని, నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నామని వెల్లడించారు. ఇంటికి తిరిగిరావాలని అభిజిత్‌ను కోరారు.

# బీజేపీ పోరుబాట

## 25 నుంచి రైతు ఘోష..

హైదరాబాద్, మే 22 : రాష్ట్రం లో పంట కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బంది పడుతున్న రైతులకు భరోసా ఇచ్చేందుకు బీజేపీ సన్నద్ధ మవుతోంది. ఇందుకు ఈనెల 25 (సోమవారం) నుంచి క్షేత్రస్థాయిలో పంట కొనుగోలు కేంద్రాలను సందర్శించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పోరుబాటకు సిద్ధమవుతోంది. మూడు రోజులపాటు పంట కొనుగోలు కేంద్రాలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షు డు ఎన్ రాంచందర్ రావుతోపాటు పార్లీ ఎంపీ లు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పరిశీలిస్తారు. మొదటిరోజు రాంచందర్‌రావు సమక్షంలో కొనుగోలు కేంద్రాల్లో నేతలందరూ పర్యటిస్తారు. ఈ మూడు రోజుల పర్యటన వివరాలను శనివారం ప్రకటించనున్నారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ లు కలిసి రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాలను పర్యటించి.. వడ్ల కొనుగోలు ఎంత జరిగింది? మొక్క జొన్న కొనుగోలు ఎంతవరకు జరిగింది? అన్న విషయాలను ప్రజల ముందుకు తీసుకు రానున్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు అధ్యక్షతన ప్రజాప్రతినిధులు బ్రేక్‌ఫాస్ట్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్‌తోపాటు పార్టీ సంస్థాగత ఇన్‌ఛార్జ్ చంద్రశేఖర్ తివారి, ఎంపీ రఘునందన్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్‌బాబు, ఎమ్మెల్సీలు ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్సీ కొమురయ్య పాల్గొని రాష్ట్రంలోని రైతు సమస్యలు, తాజా రాజకీయాలు, రాష్ట్ర కార్యవర్గ సమావేశం, భవిష్యత్ కార్యాచరణ, ఎస్ఐఆర్‌పై చర్చించారు.

### పంటను అమ్ముకోలేని స్థితిలో రైతు..

ఎన్నికల మేనిఫెస్టోలో 10 పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ప్రతి గింజను కొనుగోలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఈరోజు రైతులను మోసం చేస్తోందని, ప్రతి ఎకరానికి రూ.7,500 రైతు భరోసా ఇస్తామని చెప్పి, ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం లో వెల్లడించారు. ఇప్పు డు 'రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకు నే సమయంలో కూడా ఒక బస్తాకు అదనంగా 4 కిలోలు కోత పెడుతున్నారు. గన్నీ బ్యాగుల కోసం రైతులు వేచి ఉంటున్నారు. జొన్నల కొనుగోలు కేంద్రాలు లేక రైతులు యార్డుల్లోనే కుప్పలు వేసుకుని అక్కడే కాపలా కాస్తున్న పరిస్థితి ఉంది. ఇదిలా ఉంటే 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం పూర్తిగా తప్పుదారి పట్టించే ప్రయ త్నం. నిజంగా 80 శాతం కొనుగోళ్లు జరిగి ఉంటే, మీరు ఎక్కడికి తీసుకెళ్లినా మేము రావడానికి సిద్ధంగా ఉన్నాం. లేకపోతే మీరు మా వెంట రండి, తామే వాస్తవ పరిస్థితులు చూపి స్తాం. రాష్ట్రంలో ఇప్పటివరకు కేవలం 24 శాతం మాత్రమే వడ్ల కొనుగోలు జరిగింది. సుమా రు 1.41 కోట్ల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తే, గత సంవత్సరం కేవలం 90 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఈ ఏడాది కూడా ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారు?. సీఎంమే 45 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని చెప్పారు. ఆయన లెక్కలనే నిజమని తీసుకున్నా కూడా అది 30-శాతం మాత్రమే అవుతుంది. మరి ఏ లెక్కలతో 80 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని చెబుతున్నారు?. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 24 శాతమే కొనుగోలు చేసింది. మేం కొనుగోలు కేంద్రాలను పర్యటిస్తాం' అని చెప్పారు.

### ప్రతి చోట దోపిడీయే..

'యూరియా బస్తాల దగ్గర నుంచి గన్నీ బ్యాగుల వరకు, పంట అమ్ముకునే దశ వర కు ప్రతిచోటా దోపిడీ జరుగుతోంది. మిల్లర్లు దోచుకుంటున్నారు, దళారులు దోచుకుంటున్నారు. చివరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కూడా ఒక బస్తాకు 4 కిలోల దోపిడీ జరుగుతోంది. అంటే రైతు పండించిన పంటలో 10 శాతం మాయమవుతోంది. అది ఎవరి జేబుల్లోకి వెళ్తోంది? 90 లక్షల టన్నుల వడ్ల కొనుగోలు జరిగితే, అందులో 10 శాతం అంటే 9 లక్షల టన్నుల వడ్లు ఎవరిఖాతాల్లోకి వెళు తున్నాయి?, ఈ వేలకోట్ల దందా ఎవరి కోసం జరుగుతోంది? దీనిపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ముఖ్యంగా రైతు సమస్యలపై రైతులకు భరోసా ఇవ్వడానికి ఈ కార్యాచరణ రూపొందించాం. 3 రోజుల పర్యటన అనంతరం తదుపరి కార్యాచరణ కూడా 2 రోజుల్లో ప్రకటిస్తాం. రైత న్నకు భరోసా ఇవ్వడానికి మేం చేసే ఈ యా త్ర వారికి అండగా నిలుస్తుందని మహేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్ రాష్ట్రానికి రానున్నారు. జూన్ మొదటి వారం లో తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఈ క్రమంలో ఈ సమా వేశానికి ముఖ్యఅతిథిగా నితిన్ నబీన్ హాజరు కానున్నారు. పది జిల్లాల్లో బీజేపీ కార్యాలయాలను ఆయన ప్రారంభించనున్నారు.



# భానుడి భగభగ... ప్రజలు విలవిల

### ఉష్ణోగ్రతతో బెంబేలెత్తుతున్న ప్రజలు..

**(పగ డాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) మే 22**

గార్ల. స్థానిక మండల కేంద్రంలో భానుడి భగభగ తో ఎండలుమండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో మండల వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఎండలు నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే ఎండతీవ్రతమొదలవుతుండటంతో, మధ్యాహ్ననికి రోడ్లన్నీ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఎండ వేడితో,ఈదురులులతోఅల్లాడిపోతున్న జనం.. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి! అవుతున్నారు ముఖ్యంగావృద్ధులు చిన్నపిల్లలు, దినసరి కూలీలు ఎండ నుండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరికలు జాగ్రత్తలు సూచనలు తెలియజేశారు ప్రజలు ఎండలు ముదురుతున్న నేపథ్యంలో స్థానిక వైద్యాధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు:"తీవ్రమైన ఎండల వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ప్రజలు వీలైనంత వరకు మధ్యాహ్నం పూట బయటకు రావద్దు. ఒకవేళ రావలసి వస్తే గొడుగు, టోపీలు ధరించాలి. ఓఆర్ఎస్ (రా=రా) ద్రావణం, మజ్జిగ, మరియు ఎక్కువ మొత్తంలో నీటిని తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా చూసుకోవచ్చు."అన్నారు మండలంలో రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



# భానుడి ప్రతాపం ...ప్రజలు అతలాకుతలం

### భానుడి ప్రతాపంతోబెంబేలెత్తుతున్న ప్రజలు..

**(పగ డాల రామారావు ప్రజా తీర్పు బయ్యారం మండల ప్రతినిధి) మే 22**

బయ్యారం. స్థానిక మండల కేంద్రంలో ఎండలు మండిపోతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో మండల వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఎండలు నమోదైంది. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలవుతుండటంతో, మధ్యాహ్ననికి రోడ్లన్నీ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోలేకఅల్లాడిపోతున్న ప్రజలుతీవ్రమైన వడగాల్పులు, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, దినసరి కూలీలు ఈ ఎండల ధాటికి బెంబేలెత్తిపోతున్నారు.ఎండ వేడిమి నుండి ఉపశమనం పొందడానికి పలు సూచనలు సలహాలు ఇచ్చిన డాక్టర్లు వైద్యుల హెచ్చరికలు -- జాగ్రత్తలు:లిఎండలు ముదురుతున్న నేపథ్యంలో స్థానిక వైద్యాధికారులు ప్రజలకు పలు సూచనలు చేశారు: "తీవ్రమైన ఎండల వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ప్రజలు వీలైనంత వరకు మధ్యాహ్నం పూట బయటకు రావద్దు. ఒకవేళ రావలసి వస్తే గొడుగు, టోపీలు ధరించాలి. ఓఆర్ఎస్ (రా=రా) ద్రావణం, మజ్జిగ, మరియు ఎక్కువ మొత్తంలో నీటిని తీసుకోవడం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా చూసుకోవచ్చు."మండలంలో రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తుండటంతో, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



# గ్రామాల్లోని వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 21**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం చాకెపల్లి మరియు బుచ్చయ్యపల్లి గ్రామాల్లోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ యాసంగి వరి ధాన్యం కల్లాల్లో ఉండడం వారాలు గడిచినప్పటికీ ఇంకా ఈ మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, బెల్లంపల్లి నియోజకవర్గ రైతుల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన గడ్డం వినోద్ కు నియోజకవర్గ వెలుపల పర్యటనలకు, పార్టీలకు ఉన్న సమయం నియోజకవర్గ ప్రజల అభివృద్ధికి, రైతుల సమస్యల పరిష్కారానికి లేదని విమర్శించారు. కల్లాల్లో సిద్ధంగా ఉన్న వరి ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతీ గింజను కూడా కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో నియోజకవర్గ రైతులతో కలసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, బెల్లంపల్లి మాజీ ఎంపీపీ సుభాష్ రావు బిఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి మండల మాజీ అధ్యక్షుడు గణేష్ గౌడ్, మండల బి ఆర్ఎస్ వై మాజీ అధ్యక్షుడు మహేందర్, నాయకులు మల్లేష్, సంతోష్, రమేష్, రాజేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు అధికారులకు వినతిపత్రం అందజేత

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట) మే 22**

మండలంలోని అనంతారం గ్రామంలో నిన్న గురువారం రోజున జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులు.అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఆ గ్రామానికి చెందిన రైతుల వరి పంటలు,వరి కుప్పలు,బోరు సామగ్రి అగ్నికి ఆహుతై తీవ్ర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఆర్ సురేష్,ఎంపీడీవో శశికళ,వ్యవసాయ శాఖ ఏవో ప్రవీణ్‌లను కలిసి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.అగ్నిప్రమాదంలో కైరి పరుశురాం వరి పంటతో పాటు బోరు మోటార్,విద్యుత్ వైర్లు దగ్ధమవగా,దారవేణి దేవయ్యకు చెందిన వరి కుప్ప గడ్డి,దారవేణి ఎల్లయ్యకు చెందిన రెండు వరి కుప్పలు కాలిపోయాయి.అలాగే దారవేణి శ్రీనుకు చెందిన బోరు చాటర్లు,వొల్లాల మల్లయ్యకు చెందిన బోరు పైపులు కూడా అగ్నికి ఆహుతయ్యాయి.ఆరు నెలల పాటు శ్రమించి పండించిన పంటలు క్షణాల్లో బూడిద కావడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి సహాయం అందించాలని విజ్ఞప్తి చేసినవారిలో కైరి పరశురామ్, దారవేణి ఎల్లయ్య,దారవేణి దేవయ్య, దారవేణి శ్రీను, మల్లయ్య, పాలుగోన్నారు

# కళ్ళలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**(వి,వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 21**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం గొల్లపల్లి, జోగాపూర్, గంగారం గ్రామాల్లో వరిధాన్యం కల్లాలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండున్నర సంవత్సరాలలో రైతులకు చేసింది శూన్యమని, కెసిఆర్ ప్రభుత్వం రైతుల అభివృద్ధికై అమలుచేసిన అనేక పథకాలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. రైతుభరోసా పేరిట ఎకరానికి సంవత్సరానికి 16 వేల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిందని, సన్న వరిధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు.ఢిల్లీకి కప్పం కట్టడంలో బిజీగా ఉన్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ యాసంగి వరిధాన్యం కల్లాల్లో కమిలిపోతున్న కనీసం కనికరం చూపెట్టని కర్కశ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఏసీ లలో ఎంజాయ్ చేస్తున్నారని, కానీ వారిని నమ్మి మోసపోయిన రైతులు మాత్రం కల్లాల్లో ఎండలకు ఎండుతూ, వర్షాలకు తడవడమే కాకుండా ప్రాణాలను సైతం కోల్పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళుతెరిచి రైతుల వరి ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజా చైర్మన్ మేకల మల్లేష్, వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ గొర్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మీ-నారాయణ, ఉపసర్పంచ్ మోగిలి, జోగాపూర్ ఉపసర్పంచ్ సుమలత-శ్యామ్,బిఆర్ఎస్ నాయకులు సింగతి రాంచందర్, సంతోషం ప్రతాప్ రెడ్డి, పంజాల సాగర్ గౌడ్, ఇందూరి రమేష్, తిరుపతి గౌడ్, శివ, జాడి శంకర్, రాజేష్, ఉషన్న పాల్గొన్నారు.

# ప్రతి పౌరుడికి రూ.5 కోట్ల ఆర్థిక భరోసా కల్పించాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసిన డా॥ మార్షల్ దుర్గం నగేష్
- సమాన ఆర్థిక హక్కులతోనే సామాజిక న్యాయం సాధ్యం

**గోదావరిఖని, మే 22, (ప్రజాతీర్పు) :**



దేశ సంపదలో ప్రతి పౌరుడికి సమాన వాటా కల్పిస్తూ రూ.5 కోట్ల ఆర్థిక భరోసా పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా॥ మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు ప్రత్యేక విధానాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్తులను ప్రజల అభ్యున్నతికి వినియోగించాలని సూచించారు. పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు భూములు, ఆస్తులు, షేర్లు, ఇతర వనరులను అందించి ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు."దేశ సంపదను మన పూర్వీకులు నిర్మించారు. ఆ సంపదపై ప్రతి పౌరుడికీ సమాన హక్కు ఉంది. ప్రభుత్వాలు సంకల్పిస్తే ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం సాధ్యమే" అని డా॥ నగేష్ పేర్కొన్నారు.అనాథలు, నిరుపేదలు, వృద్ధులకు ప్రత్యేక ఆర్థిక భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కుల, మత, సామాజిక అసమానతలను తొలగిస్తూ సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ప్రజల జీవన ప్రమాణాలను పెంచే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు చేపట్టాలని డా॥ మార్షల్ దుర్గం నగేష్ విజ్ఞప్తి చేశారు.

# ఐకెపి వివోఏల నిరవధిక సమ్మెకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య




**(వి,వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాప్ రిపోర్టర్) మే 21**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఐకెపి,వివోఏ,ల నిరవధిక సమ్మెలో పాల్గొని సంఘీభావం ప్రకటించిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఐకేపీ,వివో ఏ,లకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, ఐకేపీ వివో ఏ, ల న్యాయమైన డిమాండ్లు నెరవేరెవరకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, బెల్లంపల్లి మాజీ ఎంపీపీ సుభాష్ రావు బిఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి మండల మాజీ అధ్యక్షుడు గణేష్ గౌడ్, మండల బిఆర్ఎస్ వై, మాజీ అధ్యక్షుడు మహేందర్, నాయకులు మల్లేష్, సంతోష్ రమేష్, రాజేష్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీఐకి తప్పుడు సమాచారం ఇస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

- సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపణ
- రాష్ట్ర సమాచార కమిషనర్లకు వినతిపత్రం అందజేసిన వడ్లకొండ మహేందర్ గౌడ్

**గోదావరిఖని, మే 22, (ప్రజా తీర్పు):**



సమాచార హక్కు చట్టం-2005 కింద ప్రజలు కోరుతున్న సమాచారాన్ని అధికారులు సక్రమంగా అందించడం లేదని నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ మహేందర్ గౌడ్ ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలోని ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్టీపీసీ సంస్థలు, విద్యాసంస్థలు, మండల కార్యాలయాలు, మున్సిపాలిటీ అధికారులకు గత రెండేళ్లుగా పలుమార్లు ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించినప్పటికీ సరైన సమాచారం ఇవ్వకుండా తప్పుడు వివరాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్లు దేశాల భూపాల్, పీ.వి శ్రీనివాసరావులను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. సంబంధిత శాఖలపై సమగ్ర విచారణ చేపట్టి, ప్రజలకు చట్టబద్ధంగా సరైన సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.సమాచార హక్కు చట్టాన్ని అమలు చేసే బాధ్యత కలిగిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల హక్కులు దెబ్బతింటాయని మహేందర్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. తప్పుడు సమాచారం ఇచ్చే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట సాధన కమిటీ రాష్ట్ర కార్యదర్శి కండె సాగర్ పాల్గొన్నారు.

## మామిడిపల్లిలో మహిళ గల్లంతు... పోలీసులకు ఫిర్యాదు

**(వై యాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.22**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మామిడిపల్లిలో... 22.05.2026న సాయంత్రం 16:00 గంటలకు చంద్రేశ్వరి సాహ్ (వయస్సు: 58 సంవత్సరాలు),తండ్రి: బేచన్ సాహ్,వృత్తి: ఏఎస్ఐ-సీఐఎస్ఎఫ్, నివాసం: సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్, మామిడిపల్లి గ్రామం,బాలాపూర్ మండలం,రంగారెడ్డి జిల్లా వారు ఫిర్యాదు అందజేశారు.ఫిర్యాదు వివరాల ప్రకారం, ఫిర్యాదుదారు తన భార్య కిరణ్ దేవి (వయస్సు: 54 సంవత్సరాలు),గృహిణి, మరియు ఇద్దరు పిల్లలతో కలిసి నివసిస్తున్నారు. 21.05.2026న ఉదయం సుమారు 05:00 గంటలకు విధులకు వెళ్లిన ఫిర్యాదుదారు,అదే రోజు ఉదయం 10:00 గంటలకు తిరిగి ఇంటికి వచ్చినప్పుడు తన భార్య ఇంటిలో లేకపోవడం గమనించారు. తన పిల్లలను అడగగా,వారు లేచే సమయానికి తల్లి ఇంటిలో లేరని తెలిపారు. అనంతరం ఫిర్యాదుదారు పరిసర ప్రాంతాలు మరియు బంధువుల వద్ద వెతికినా ఆమె జాడ తెలియలేదు.కిరణ్ దేవి మానసిక ఆరోగ్యం బాగోలేకపోవడంతో 2017 సంవత్సరం నుండి మందులు వాడుతున్నట్లు తెలిపారు.ఒక సంవత్సరం క్రితం కూడా ఇంటి నుండి వెళ్లిపోయి మూడు రోజుల తరువాత కనిపించిన సంఘటన ఉన్నట్లు పేర్కొన్నారు. మిస్సింగ్ మహిళ వివరాలు:చర్మవర్ణం: తెలుపు, ముఖం: గుండ్రంగా, ఎత్తు: సుమారు 5 అడుగులు, భాషలు: హిందీ మరియు మైథిలి మాత్రమే మాట్లాడగలదు. ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకు..

- జిల్లా మంత్రిగా ప్రజా సమస్యల పరిష్కారం నా బాధ్యత..

రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 22.**



అభివృద్ధి సంక్షేమ రెండు కళ్ళుగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక జగిత్యాల జిల్లా సమావేశం జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి అడ్లూరి అన్నారు. 99 రోజులపాటు పది అంశాలపై ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక గ్రామ, మండల, నియోజకవర్గ మరియు జిల్లా స్థాయి సమీక్ష సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు నివేదికలను తయారుచేసి దశలవారీగా ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి వివరించారు. ప్రభుత్వం ఎస్సీ బీసీ మైనార్టీ వర్గాల విద్యకు ప్రాధాన్యమిస్తుందని ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూలుకు స్థలం కేటాయించామని మంత్రి తెలిపారు. జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుపై నడుస్తున్న వివాదంపై మంత్రి స్పందించారు. కేంద్రీయ విద్యాలయానికి అవసరమైతే మరో మూడు ఎకరాల స్థలం కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది అధిక మొత్తంలో వరి, మొక్కజొన్న దిగుబడులు వచ్చాయని ఇప్పటి వరకు జగిత్యాల జిల్లాలో 35 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని 2.60 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఈ సందర్భంగా మంత్రి కోరారు. ఈకార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, జగిత్యాల ధర్మపురి మున్సిపల్ చైర్మన్లు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం వద్దు..

- బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 22.**



విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయం వద్దు.. – కేంద్రీయ విద్యాలయం కోసం 5 ఎకరాలు కేటాయించాలి"... జగిత్యాల ఎమ్మెల్యే హయాంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి... కేంద్ర ప్రభుత్వం నిధుల్లో భారీ అవినీతికి పాల్పడ్డారు.. వీటిపై విచారణకు ఎమ్మెల్యే సంజయ్ సిద్ధమా..?? అని బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి ప్రశ్నించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలని ప్రభుత్వ ప్రజాప్రతినిధులను కోరారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ కృషితో జిల్లాకు నవోదయ విద్యాలయం రెండో విద్యా సంవత్సరంలో విజయవంతంగా కొనసాగుతోందని, ఇప్పుడు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశం ఉందన్నారు. కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం కనీసం 5 ఎకరాల స్థలం అవసరమని, చల్గల్ ప్రాంతంలోని స్థలమే అందుకు అనువైనదని పేర్కొన్నారు. "2 ఎకరాల స్థలం ఉంటే రిజెక్ట్ అవుతుందని తెలిసినా ఎందుకు కేటాయించారు? వెంటనే 5 ఎకరాల స్థలం కేటాయిస్తే అద్దె భవనంలో తరగతులు ప్రారంభించే అవకాశం ఉంటుంది" అని అన్నారు. వాలంటరీ బోర్డు సభ్యురాలు అనితతో పాటు కలెక్టర్ గారు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కావాలనే ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కేంద్రీయ విద్యాలయం కోసం కేవలం రెండెకరాలు మాత్రమే మంజూరు చేయించుకొని వచ్చి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. విద్యార్థులకు అణువుగా లేని వేరే ప్రాంతాల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు అంత అనుకూలంగా ఉండదని, విద్యార్థులు, విద్యార్థుల తరలిదండ్రులు భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. అయినప్పటికీ విద్యార్థుల ఇబ్బందులను పక్కనపెట్టి తన స్వార్థం కోసం ఎమ్మెల్యే సంజయ్ అక్కడే స్థలం కేటాయించాలని పట్టు పట్టడం సరికాదన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కనీసం 20 ఎకరాల భూమి అవసరమని, విద్యార్థుల అంశంలో ఎమ్మెల్యే సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. "పిల్లల భవిష్యత్తు కోసం రాజకీయాలు పక్కన పెట్టాలి" అన్నారు. కేవలం తనకు రావలసిన బిల్లుల కోసమే పార్టీ మారారని, జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం కాదని తమకు, నియోజక వర్గ ప్రజలకు తెలుసు అన్నారు. ఇక జగిత్యాల మున్సిపాలిటీలో కేంద్రం నుంచి వచ్చిన రూ.62 కోట్ల నిధుల పనుల్లో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇప్పటికే పూర్తయిన సీసీ రోడ్ల పనులకే మళ్లీ టెండర్లు పిలుస్తున్నారని, 1 నుంచి 48 వార్డుల వరకు జరిగిన పనుల్లో స్కాం జరిగిందని పేర్కొన్నారు. "జగిత్యాల మున్సిపాలిటీలో రూ.60 కోట్ల పనుల స్కాంను బయటపెడతాం. ప్రజాధనం దుర్వినియోగం అవుతోంది. ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని హెచ్చరించారు. చెట్ల పేరుతో డివైడర్లను మార్చే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. చెట్ల పనులు, డివైడర్లు, రూ.62 కోట్ల అభివృద్ధి పనులు, 2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణాలపై, ఎమ్మెల్యే హయాంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనులపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. తాను మున్సిపల్ చైర్ పర్సన్‌గా పనిచేసిన సమయంలోనే డివైడర్లను కట్టకుండా అడ్డుకున్నారని, కానీ తాను మాత్రం ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేవిధంగా డివైడర్ల నిర్మాణం చేపట్టినట్టు గుర్తు చేశారు. అలాగే ఎంపీ అర్వింద్ తీసుకొచ్చిన నేషనల్ హైవేలు, బైపాస్‌లపై స్థానిక నేతలు స్పందించడం లేదని విమర్శించారు. యావర్ రోడ్ విస్తరణపై టిడిఆర్ తీర్మానం ఆమోదమైనా పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నిస్తూ, "చిత్తశుద్ధి ఉంటే యావర్ రోడ్ విస్తరణ చేసి చూపండి" అన్నారు. యావర్ రోడ్డు విస్తరణను ఉద్దేశపూర్వకంగానే జగిత్యాల ఎమ్మెల్యేనే అడ్డుకుంటున్నారని అంటూ ఆయనకు కావలసిన వ్యక్తులే బయట ప్రచారం చేస్తున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. "చేతగాకపోతే అధికారంలో ఎందుకు ఉండాలి?" అంటూ ప్రభుత్వ ప్రజాప్రతినిధులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జగిత్యాల నియోజకవర్గం పై ఇప్పటికైనా సవతి తల్లి ప్రేమ మానుకోవాలని సూచించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ నిజమైన రాజకీయాల మానుకొని విద్యార్థుల భవిష్యత్తు కోసం, జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని హితువు పలికారు. ఈ సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కు గంగాధర్, 42వ వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, ఉపాధ్యక్షులు పవన్ సింగ్, గదాసు రాజేందర్, గడ్డల లక్ష్మి, జిల్లా మహిళ మోర్చా నాయకురాలు దూరిశెట్టి మమత, సిరిపురం శ్రీనివాస్, గట్టిపెల్లి జ్ఞానేశ్వర్, పూదరి శ్రీనివాస్, మధురిమ, సింగం పద్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి నిర్మూలనలో ప్రజల సహకారం అవసరం

### మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్

**(వి.వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 21**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు బానిసలైన వారిలో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డి–అడిక్షన్ సెంటర్‌ను మంచిర్యాల డిసిపి ఏ. భాస్కర్, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ కలిసి సందర్శించారు. మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డి–అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న యువకులతో డిసిపి మాట్లాడి,వారి ఆరోగ్య పరిస్థితి,చికిత్స విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపి, మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలైన వారిని గుర్తించి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారిని గౌరవ కోర్టు ఆదేశాల మేరకు 15 రోజుల పాటు డి–అడిక్షన్ సెంటర్‌కు పంపిస్తున్నామని తెలిపారు ఇక్కడ వారికి వైద్య చికిత్సతో పాటు మానసికంగా మార్పు తీసుకురావడానికి ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటివరకు మంచిర్యాల జోన్ పరిధిలో 19 మందికి నార్కోటిక్ పరీక్షలు నిర్వహించి,పాజిటివ్ వచ్చిన వారిని డి–అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు వెల్లడించారు. గంజాయి సరఫరా చేసే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, అలాగే గంజాయి సేవించే వారిని గుర్తించి వారిని ఆ అలవాటు నుంచి దూరం చేస్తే సరఫరా కూడా తగ్గే అవకాశముందని డిసిపి అన్నారు. తల్లిదండ్రులు,పెద్దలు తమ పరిసరాల్లో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నా లేదా సేవిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. పోలీసులు స్పందించి నిందితులపై కేసులు నమోదు చేసి నార్కోటిక్ పరీక్షలు నిర్వహిస్తారని, పాజిటివ్ వచ్చిన వారిని డి–అడిక్షన్ సెంటర్లకు పంపించి చికిత్స అందిస్తామని తెలిపారు. అయితే చికిత్స తర్వాత కూడా మళ్లీ మత్తు పదార్థాలకు బానిసై పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. నిపుణులైన వైద్యుల సహాయంతో మత్తు బారిన పడిన వ్యక్తులు తిరిగి సాధారణ జీవితంలోకి వచ్చే అవకాశం ఉందని, డ్రగ్స్ రహిత మంచిర్యాల నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని డిసిపి భాస్కర్ పిలుపునిచ్చారు.



## బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా కందుల సంధ్యారాణి

- జనగామ మండల బీజేపీ నాయకుల ఘన సన్మానం
- ప్రజాసేవకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయి పదవి దక్కిందని హర్షం

**గోదావరిఖని, మే 22, (ప్రజా తీర్పు):**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా నియమితులైన ప్రముఖ బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణిని జనగామ మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. జనగామ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, కందుల సంధ్యారాణి ప్రజాసేవలో ఎన్నో సంవత్సరాలుగా విశేష సేవలు అందిస్తూ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఎంపీటీసీగా, ఎంపీపీగా, రెండుసార్లు జెడ్పీటీసీగా పనిచేసి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి, ముఖ్యంగా ఓబీసీ వర్గాల అభ్యున్నతికి ఆమె నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఆమె సేవలను గుర్తించిన రాష్ట్ర బీజేపీ నాయకత్వం ఓబీసీ మోర్చా ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించడం హర్షణీయమన్నారు. కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత అంకితభావంతో పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తడగొండ నరసయ్య, మాజీ మండల అధ్యక్షుడు కోడూరి రమేశ్, ఇరుగురాల శివకుమార్–శారద, అంకరి భరత్, బియ్యాల మహేందర్, మీస వికాస్, గుండబోయిన పృథ్వీరాజ్, ఆకునూరి రమేశ్–తిరుమల, జనగామ సాగర్, కొట్టె నరేష్, గురువయ్య, బుంగ మహేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సంధ్యారాణికి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎవరెస్ట్ దిగుతూ ఇద్దరు భారతీయుల మృతి

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన ఇద్దరు భారత పర్వతారోహకులు కిందికి దిగుతుండగా మరణించారని ఒక అధికారి శుక్రవారం తెలిపారు. మృతులను అరుణ్ కుమార్ తివారీ, సందీప్ ఆరేగాగా గుర్తించారు. వారిద్దరూ కిందికి దిగుతుండగా అలసిపోయారని, వారిని రక్షించేందుకు గైడ్లు ప్రయత్నించినా సఫలం కాలేదని ఎక్స్‌పెడిషన్ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆఫ్ నేపాల్ ప్రధాన కార్యదర్శి రిషి భండారీ తెలిపారు. ఎవరెస్ట్ శిఖరం నుంచి కిందికి దిగుతుండగా గురువారం సాయంత్రం తివారీ హిల్లరీ స్టెప్ వద్ద కుప్పకూలిపోయారని ఈ పర్వతారోహణ యాత్రను నిర్వహించిన పైనీర్ అడ్వెంచర్స్ డైరెక్టర్ నివేష్ కర్కీ చెప్పారు.



## శ్రీపాదకాలనీలో సింటెక్ ట్యాంక్ ప్రారంభం

**మంథని, మే-22(ప్రజాతీర్పు)**

వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని శ్రీపాద కాలనీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సింటెక్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని కోరుతూ అందజేసిన వినతిపత్రం మేరకు శుక్రవారం శ్రీపాద కాలనీలో ఏర్పాటు చేసిన సింటెక్ ట్యాంక్‌ను మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముసుకుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు కుర్ర లింగయ్య, నూకల కమల్, ఎరుకల స్రవంతి రమేష్, ఎల్లంకి వంశీ, జంబోజు సమ్మయ్య శ్రీమతి, మారుపాక నిహారిక నాగరాజు, వేముల లక్ష్మీ సమ్మయ్య లు కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మూల పురుషోత్తంరెడ్డి, ఆకుల శ్రీనివాస్, పాపారావు, గోవిందుల రమేష్, సరిత, సుగుణ, రజిత, రేణుక, నర్సమ్మ, స్రవంతి, ఈశ్వరయ్య, సంతోష్, అమర్నాథ్, కనకరాజు, ప్రసాద్, బాలరాజు, అంజి తదితరులు పాల్గొన్నారు. కాలనీలో వేసవి కాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యగా సింటెక్ ట్యాంక్ ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ ట్యాంక్ ద్వారా కాలనీవాసులకు అవసరమైన సమయంలో తాగునీరు అందుబాటులో ఉండనుందని వారు పేర్కొన్నారు.

## మహేశ్వరం అంగట్లో అక్రమ వసూళ్లు పట్టించుకోని అధికారులు

**(వై యాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.22**



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం జరిగే వారసంతలో నిర్వాహకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని రైతులు బాధపడుతున్నారు మండల కేంద్రానికి చుట్టుపక్కల ఉన్న గ్రామాల చిన్న రైతులు వారం సంతలో తాము పండించే కూరగాయలను అంగట్లో అమ్ముకోవడానికి వస్తున్నారు . వారి వద్ద నుండి తై బజార్ నిర్వాహకులు టమాట బాక్స్ కి 50 రూపాయలు సంచికి 50 రూపాయల నుండి 100 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఉదయం రైతుల దగ్గర వసూలు చేసి సాయంత్రం అంగట్లో అమ్ముకునే వారి దగ్గర కూడా 150 రూపాయలు వసూలు చేస్తుంటే అడిగే వారు లేరన్నారు ఇదేంటి అని రైతులు ప్రశ్నిస్తే మేము లక్షలు పెట్టి కొన్నాము ఇలాగే వసులు చేస్తామని బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నామని ఆవేదన చెందుతున్నమని చెప్పారు. ఈ విషయమై రెండు వారాల ముందు మహేశ్వరం గ్రామపంచాయతీ సెక్రటరీ గారి దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడంలేదని రైతుల ఆవేదన చెందుతున్నారు ఎటువంటి వసతులు కల్పించకుండా సూచిక బోర్డు ఏర్పాటు చేయకుండా విధివిధానాల రూపొందించకుండా రైతుల పొట్ట కొడుతున్న దళారుల ఆగడాలను అడ్డుకోవాలని రైతులు కోరుతున్నారు



## బొక్కల వాగు కట్టపై తాత్కాలిక వెజ్ నాన్‌వెజ్ మార్కెట్ షెడ్ల ప్రారంభం

**మంథని, మే-22(ప్రజాతీర్పు)**

మంథని పట్టణంలోని బొక్కల వాగు కట్టపై నిర్మించిన తాత్కాలిక వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ షెడ్లను మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. పట్టణంలోని కూరగాయలు, చికెన్, మటన్ వ్యాపారులకు అనుకూలంగా ఈ తాత్కాలిక మార్కెట్ షెడ్లను నిర్మించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో టియూఎఫ్ఐడిసి నిధుల ద్వారా రూపాయలు 7 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. ఆ నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బొక్కల వాగు కట్టపై ఉన్న ఓపెన్ జిమ్ సమీపంలోని విశాలమైన ప్రదేశంలో తాత్కాలిక మార్కెట్ షెడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కూరగాయలు, చికెన్, మటన్ విక్రయదారులు సౌకర్యవంతంగా వ్యాపారం నిర్వహించుకునే విధంగా ఈ షెడ్లను నిర్మించామని, పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు బొక్కల వాగు కట్టపై ఏర్పాటు చేసిన ఈ మార్కెట్‌కు వచ్చి కూరగాయలు, మాంసం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మద్దికట్ల స్రవంతి, పోతరబోయిన శ్రీలత, జంబోజు శ్రీమతి, లైశెట్టి రజిత, మారుపాక నిహారిక, పెంటరి రాజు, యేల్లంకి వంశీధర్, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ప్రజలు పాల్గొన్నారు.



## నెన్నెల్ మండలం గొల్లపల్లి జోగాపూర్ గంగారం గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు పరిశీలన

### మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**(దండే భూమన్న ప్రజా తీర్పు మంచిర్యాల జిల్లా ప్రతినిధి) మే 22**

బెల్లంపల్లి నియోజకవర్గం – నెన్నెల మండలం గొల్లపల్లి, జోగాపూర్, గంగారం గ్రామాల్లో వరిధాన్యం కల్లాలను పరిశీలించి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీ దుర్గం చిన్నయ్య ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండున్నర సంవత్సరాలలో రైతులకు చేసింది శూన్యమని, కె సి అర్ ప్రభుత్వం రైతుల అభివృద్ధికై అమలుచేసిన అనేక పథకాలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. రైతుభరోసా పేరిట ఎకరానికి సంవత్సరానికి 16 వేల రూపాయలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడుసార్లు రైతుభరోసా ఎగ్గొట్టిందని, సన్న వరిధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని బోగస్ మాటలు చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదని విమర్శించారు. ఢిల్లీకి కప్పం కట్టడంలో బిజీగా ఉన్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఈ యాసంగి వరిధాన్యం కల్లాల్లో కమిలిపోతున్న కనీసం కనికరం చూపెట్టని కర్కశ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. రైతుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్–ూజ లలో ఎంజాయ్ చేస్తున్నారని, కానీ వారిని నమ్మి మోసపోయిన రైతులు మాత్రం కల్లాల్లో ఎండలకు ఎండుతూ, వర్షాలకు తడవడమే కాకుండా ప్రాణాలను సైతం కోల్పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళుతెరిచి రైతుల వరి ధాన్యాన్ని ఎలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మేకల మల్లేష్ వైస్ చైర్మన్ కొయ్యడ శ్రీనివాస్ గౌడ్ గొల్లపల్లి సర్పంచ్ జాడి లక్ష్మీ–నారాయణ ఉపసర్పంచ్ మోగిలి జోగాపూర్ ఉపసర్పంచ్ సుమలత–శ్యామ్ బి ఆర్ ఎస్ నాయకులు సింగతి రాంచందర్ సంతోషం ప్రతాప్ రెడ్డి పంజాల సాగర్ గౌడ్ ఇందూరి రమేష్ తిరుపతి గౌడ్ శివ జాడి శంకర్ రాజేష్ సురేష్ ఉషన్న తదితరులు పాల్గొన్నారు.

## వస్తువులపై ధరల ముద్రణ కోసం ఏబిజిపి దేశవ్యాప్త ఉద్యమం

### ఏబిజిపి నేతలు నాగమల్ల సురేష్ నలువాల రాజేందర్ సురభి శ్రీధర్

**( వకులాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 22**



ఎంఆర్ పి ప్రస్తుతం వినియోగదారుల రక్షణ సాధనంగా కాకుండా, మార్కెటింగ్ , ధరల మోసం చేసే సాధనంగా మారిందని, మాక్సిమం రిటైల్ ప్రైస్ (ఎమ్మార్పీ)నియంత్రణ చట్టం తీసుకురావాలని, వస్తువులపై ధరల ముద్రణ కోసం ఏబిజిపి దేశవ్యాప్త ఉద్యమం నిర్వహిస్తుందని అఖిల భారతీయ గ్రహక్ పంచాయతీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగమల్ల సురేష్, జిల్లా అధ్యక్షులు నలువాల రాజేందర్ , కార్యదర్శి సురభి శ్రీధర్ తెలిపారు. వినియోగదారులకు జరుగుతున్న అన్యాయం, మోసాలపై ఏబిజిపి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ద్వారా భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీలు తమ ఇష్టానుసారం అత్యధిక ఎమ్మార్పీ పెట్టి తర్వాత భారీ డిస్కౌంట్లు ప్రకటించి వినియోగదారులను మోసం చేస్తున్నాయన్నారు. అసలు తయారీ ఖర్చుతో పోలిస్తే ధరలు అనేక రెట్లు పెంచుతున్నారని అన్నారు. ఆన్‌లైన్లో మాల్స్‌లో ఒకే వస్తువుకు విపరీత ధర తేడాలు ఉంటున్నాయన్నారు. వినియోగదారుడికి అసలు ధర, లాభం, సరైన విలువ గురించి స్పష్టత ఉండడం లేదన్నారు. అందుకే ఎబిజీపి వినియోగదారులను చైతన్యవంతులు చేయడానికి, మోసాలను అరికట్టడానికి దేశవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రధానంగా ఎంఆర్ పి పై గరిష్ట పరిమితి (సీలింగ్) నిర్ణయించే చట్టం తీసుకురావాలనీ, ఉత్పత్తిపై తయారీ ఖర్చు జీఎస్టీ చెల్లించిన మొదటి అమ్మకపు ధర తప్పనిసరిగా ముద్రించాలనీ, మోసపూరిత డిస్కౌంట్ లపై నిషేధం విధించాలనీ, ఎమ్మార్పీ దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు స్వతంత్ర కమిషన్/అథారిటీ ఏర్పాటు చేయాలని, ఉల్లంఘనలకు కఠిన శిక్షలు విధించేలా చట్ట సవరణలు చేయాలనీ వార డిమాండ్ చేశారు . ప్రధాన డిమాండ్లను కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకు వెళ్లడానికి వినతిపత్రం సమర్పించినట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు.

# వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

- తీవ్ర ఎండలు, వేడి గాలుల నేపథ్యంలో ప్రజలకు డీఎంహెచ్‌వో సూచనలు

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 22:**



జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ హెచ్చరికల మేరకు జిల్లాలో తీవ్ర ఎండలు, వేడి గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే. ప్రమోద్‌కుమార్ సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అవసరం లేకపోతే బయటకు రావొద్దని సూచించారు. ఎండ సమయంలో అధిక శ్రమ చేయకుండా ఉండాలని, చెప్పులు లేకుండా బయట తిరగవద్దని తెలిపారు. ఆల్కహాల్, టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్, అధిక తీపి పానీయాలను తగ్గించాలని, నిల్వ ఆహారాన్ని తీసుకోవద్దన్నారు. ఎండలో నిలిపిన వాహనాల్లో పిల్లలు, పెంపుడు జంతువులను వదిలివేయకూడదని హెచ్చరించారు. దాహం లేకపోయినా తరచూ నీరు తాగాలని, ప్రయాణాల సమయంలో తాగునీరు వెంట తీసుకెళ్లాలని సూచించారు. ఓఆర్ఎస్, నిమ్మరసం, మజ్జిగ, లస్సీ వంటి ద్రవపదార్థాలు తీసుకోవడం మంచిదన్నారు. తర్బూజ, పుచ్చకాయ, ద్రాక్ష, ఆరెంజ్, దోసకాయ వంటి నీటి శాతం ఎక్కువగా ఉన్న పండ్లు, కూరగాయలు తీసుకోవాలని తెలిపారు. ఇళ్లలో గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవాలని, పగటి వేళల్లో కిటికీలు, కర్టెన్లు మూసి ఉంచి రాత్రివేళ చల్లని గాలి లోపలికి వచ్చేలా తెరవాలని సూచించారు. బయటి పనులను ఉదయం లేదా సాయంత్రం వేళల్లో చేసుకునేలా ప్రణాళిక చేసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలుగా మగత, మూర్ఛ, వికారం, వాంతులు, తలనొప్పి, తీవ్రమైన దాహం, ముదురు రంగు మూత్రం, వేగవంతమైన శ్వాస, గుండె స్పందనలు ఉంటాయని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి ద్రవపదార్థాలు ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుడిని చల్లని ప్రదేశానికి తీసుకెళ్లి, చల్లటి నీటితో శరీరాన్ని తుడవాలని, స్పృహలో ఉంటే ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, మజ్జిగ వంటి పానీయాలు ఇవ్వాలని తెలిపారు. వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండటం, చెమట పట్టకపోవడం వంటి పరిస్థితుల్లో వెంటనే 108కు కాల్ చేయాలని డీఎంహెచ్‌వో సూచించారు.



# విజయవంతంగా ముగిసిన "యువత కోసం పరిశుభ్ర తెలంగాణ" శిబిరం

### సమ్మర్ కోచింగ్ కేంద్రాల పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 22:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పెద్దపల్లి జిల్లాలో నిర్వహించిన ఐదో రోజు "యువత కోసం పరిశుభ్ర తెలంగాణ -- సేవా సహకార" సమ్మర్ శిబిర కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ శిబిరాల్లో శుక్రవారం ఉదయం 6 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించి, శిబిర ప్రాంగణాలను చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా, పచ్చదనంతో ఉండేలా శుభ్రపరిచారు. గర్రేపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి ఎ.సురేష్, ఉప సర్పంచ్ నవీన్ పాల్గొన్నారు. సమ్మర్ కోచింగ్ శిబిరాల ఇన్‌చార్జులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. యువతలో సామాజిక బాధ్యత పెంపొందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.



# జగిత్యాల అభివృద్దే లక్ష్యం గా... ముందుకు వెళుతున్న...

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 22.**

జగిత్యాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా ప్రధాన లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లా కేంద్రంలోని 42వ వార్డు లో శుక్రవారం రోటరీ పార్క్ పక్కన రూ.48 లక్షలతో నూతనంగా వేసిన బీటీ రోడ్డును జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించి మాట్లాడారు.బీటీ రోడ్డు పక్కన టైల్స్ తో వర్షపు నీటి డ్రైన్ ను ఏర్పాటు చేస్తామని తద్వారా బీటీ రోడ్డు పాడవకుండా ఉంటుందన్నారు. వార్డు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పట్టణం లో పన్ను వసూలు, ప్రజలకు తాగు నీటి సరఫరా , పచ్చదనం పరిశుభ్రత, కరెంట్ వృథా లేకుండా, తడి పొడీ చెత్త వేరుగా ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. ప్రజలు ప్లాస్టిక్, చెత్త రెండు కలిపి ఇవ్వడం వల్ల డంపింగ్ యార్డు లు కూడా సరిపోవు అన్నారు. జగిత్యాల పట్టణ భావి తరాలకు ఉపయోగంగా అన్ని పార్టీల కౌన్సిలర్ లను కలుపుకొని సలహాలు సూచనలు తీసుకొని ముఖ్య అజెండా రూపొందించాలని అని అన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధి కి పరిశుభ్రతకు అధికారులతో పాటు ప్రజల సహకారం అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మెన్ సమిండ్ల వాణి శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ గడ్డం నారాయణరెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ సెక్రటరీ బండ శంకర్,కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం ,గోలి శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్,సీనియర్ నాయకులు కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ , అడువల లక్ష్మణ్, మన్సూర్, డా.నరహరి, ణవ వరుణ్, ఆనంద్,వార్డు నాయకులు నకుమల్ల రాజు ,దాసరి ప్రవీణ్, లక్ష్మీ నారాయణ,పోతునుక మహేష్, వార్డు ప్రజలు,కౌన్సిలర్ లు నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 22(ప్రజాతీర్పు ):**

నిర్మల్ పట్టణంలో జరుగుతున్న ఇండ్ల గణన ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని పురపాలక కార్యాలయంలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియపై కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, హౌస్ లిస్టింగ్ ప్రక్రియలో భాగస్వామ్యమైన అధికారులను, ఈ ప్రక్రియకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, పట్టణ ప్రాంతాలలో హౌస్ లిస్టింగ్ ప్రక్రియ మరింత జాగ్రత్తగా నిర్వహించాలని పేర్కొన్నారు. హౌస్ లిస్టింగ్ కి సంబంధించి అధికారులను పలు ప్రశ్నలు అడిగి వారి అవగాహనను అంచనా వేశారు. ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రశ్నలు అడిగి అవసరమైన మేరకు వివరాలు సేకరించాలన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరిన తెలంగాణ ఉద్యమకారుల వేదిక

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 22:**




అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర వైస్ చైర్మన్ తోడేటి శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారని ఆయన విమర్శించారు. వివిధ తెలంగాణ ఉద్యమ సంఘాల పోరాటాల ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారుల సేవలు, త్యాగాలను గుర్తించే ప్రక్రియ ప్రారంభించిందన్నారు. అయితే కమిటీ ఏర్పాటు చేసి రెండున్నర ఏళ్లు గడిచినా ఇప్పటికీ స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని కేసులపాలైన నిజమైన ఉద్యమకారులను గుర్తించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కమిటీ ఏర్పాటు చేయడమే కాకుండా త్వరితగతిన ఉద్యమకారులకు న్యాయం చేయాలని సూచించారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ప్రభుత్వ స్థలం, ఇల్లు, గుర్తింపు కార్డులు, అమరవీరుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రైల్వే--బస్ పాస్‌లు, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. ఉద్యమకారులకు తగిన గౌరవం, పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో నిజమైన ఉద్యమకారులు ఎవరైనా ఉంటే 9491404333 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల వేదిక తరపున నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఆరు మండలాల అధ్యక్షులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా కన్వీనర్ అనుముల కళావతి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రంగారపు శాంతలక్ష్మీ, రాష్ట్ర కో-కన్వీనర్ తోడేటి స్వరూప, ఉద్యమకారులు బోయిన సదానందం, ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఏఎల్‌పి మైన్ లో మంచినీటి కటకట.. 5 వేల మంది కార్మికులు తీవ్ర ఇబ్బందులు

### తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు బిజెపి నాయకుడు హెచ్చరిక

**రామగిరి, మే-22(ప్రజాతీర్పు)**



రామగిరి మండలంలోని సింగరేణి ఏఎల్‌పి అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ మైన్ లో కార్మికులు తీవ్ర మంచినీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని బిజెపి నాయకులు మరియు ఎంపిటిసి ఫోరం మాజీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ ఆరోపించారు. దేశంలోనే అతిపెద్ద యాంత్రీకృత భూగర్భ గనులలో ఒకటైన ఏఎల్‌పి మైన్ లో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికి కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఏఎల్‌పి మైన్ దేశంలోనే అతిపెద్ద యాంత్రీకృత భూగర్భ గనులలో ఒకటిగా గుర్తింపు పొందింది. మైన్ లో సుమారు 3 వేల మంది శాశ్వత కార్మికులు, 2 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఆరు షిఫ్టులలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం 46 డిగ్రీల తీవ్ర ఎండల్లో కార్మికులు పని చేస్తున్నప్పటికి తాగేందుకు సరిపడా మంచినీరు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీటి సరఫరా కోసం ఆటో ద్వారా నీటిని తెప్పించే పరిస్థితి నెలకొందని, క్యాంటిన్‌లో కూడా తాగేందుకు నీరు లేదని, బాత్రూముల్లో సైతం నీటి కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు.మహిళా కార్మికులు కూడా విధులు నిర్వహిస్తున్న ఈ మైన్ లో నీటి సమస్య మరింత ఇబ్బందికరంగా మారిందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు లేకపోవడం వల్ల మహిళా కార్మికులు ప్రత్యేకంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకొని తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడం యాజమాన్యం నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని విమర్శించారు. భూగర్భ గనుల్లో పని చేసే కార్మికులకు తాగునీరు అత్యవసరమని, ఎండదెబ్బ తగిలి ఎవరైనా అస్వస్థతకు గురైతే పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. గనిలోకి దిగే ప్రతి కార్మికుడికి తగినంత మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం యాజమాన్యం బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారుల నిర్లక్ష్యంపై సింగరేణి సిఎండి, డైరెక్టర్ పర్సనల్ కు ఫిర్యాదు చేస్తామని మొలుమూరి శ్రీనివాస్ తెలిపారు. తాగునీటి సమస్యపై వెంటనే విజిలెన్స్ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## మహిళపై దాడి.... బంగారు గొలుసు చోరీ

- తలపై తీవ్రంగా కొట్టడంతో తీవ్ర గాయాలు
- ఘటనస్థలిని పరిశీలించిన సిద్దిపేట సీపీ

**హుస్నాబాద్ మే 22 ప్రజా తీర్పు**



హుస్నాబాద్ నియోజకవర్గం లోని అక్కన్నపేట మండలం మంచినీళ్ల బండ గ్రామంలో గురువారం రాత్రి బోయిని రాజవ్వ ను గుర్తు తెలియని దుండగులు తలపై తీవ్రంగా గాయపరిచారు. రాజవ్వ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు తలపై ఇనుప వస్తువుతో మోదినట్లు తెలుస్తోంది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న రాజవ్వ మెడలోంచి మూడున్నర తులాల బంగారు గొలుసును తస్కరించారు. దీంతో తీవ్ర రక్తస్రావం జరగగా రాజవ్వను హుటాహుటిన హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుండి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన చికిత్స అందించడం కోసం హైదరాబాద్ లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందిందని బంధువులు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులు గుర్తు తెలియని దుండగులా లేక దోపిడీ దొంగల పనా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు.



# యూరియా సరఫరా, ధాన్యం అన్‌లోడింగ్ పనులు వేగవంతం చేయాలి

- రాక్ పాయింట్, మార్కెట్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), మే 22:**

పెద్దపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రాక్ పాయింట్ నుంచి యూరియా సరఫరా, మార్కెట్ యార్డ్‌లో ధాన్యం అన్‌లోడింగ్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెద్దపల్లి రైల్వే స్టేషన్ పరిధిలోని యూరియా రాక్ పాయింట్‌తో పాటు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా రాక్ పాయింట్ వద్ద నిల్వ ఉన్న యూరియాను త్వరితగతిన జిల్లావ్యాప్తంగా సరఫరా చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన లారీలు, హమాలీ కార్మికులను సమకూర్చుకుని ఎలాంటి అంతరాయం లేకుండా పంపిణీ చేపట్టాలని అధికారులకు తెలిపారు. పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌కు రైతులు తీసుకొస్తున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను ఆలస్యం లేకుండా వెంటనే చేపట్టాలని ఆదేశించారు. లారీల కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, తగినంత మంది హమాలీ కార్మికులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కార్పోరేట్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ:

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల, మండల్)మే22**



2026-27 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 10 తరగతి వార్షిక పరీక్షలలో 7.0 సి జీ.పి.ఎ. ఆపై మార్కులు సాధించి కార్పొరేట్ (ఇంటర్) కళాశాలలలో ప్రవేశం పొందగోరు జిల్లాకు చెందిన ఎస్. సి./ ఎస్.టి./ బి.సి./ మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఆన్ లైన్ లో ఞఞ.వశ్రీఖఅస్త్రుఞఖవజూఖం.స్త్రశీజ.ఱఅ వెబ్ సైట్ లో ఈనెల 20వ తేదీ నుండి జూన్ 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 10వ తరగతి మెరిట్ ఆధారంగా సి.జి.జి. ద్వారా ప్రవేశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు మీ- సేవ నుండి పొందిన ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, మొబైల్ నెంబర్, ఈ -మెయిల్ ఐడి, 10వ తరగతిలో 7, ఆపైన గ్రేడ్ పాయింట్ (400 పైన) మార్కులు కలిగిన విద్యార్థులు మార్కుల మెమో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బి.ఎ. ఎస్./ హెచ్.పి.ఎస్. విద్యార్థులు పాఠశాల/ సంబంధిత జిల్లా అధికారి ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలని, సి.బి.ఎస్.సి. విద్యార్థులు జిల్లా అధికారి ద్వారా 10వ తరగతి వివరాలు నమోదు చేసుకోవాలని, సర్టిఫికెట్ (4వ తరగతి నుండి 10వ తరగతి వరకు తెలంగాణలో చదివి ఉండాలి), వసతి గృహ బోనఫైడ్ సర్టిఫికెట్ (ప్రభుత్వ ఎస్. సి./ ఎస్.టి./ బి.సి. వసతి గృహ విద్యార్థులు మాత్రమే) కలిగి ఉండాలని తెలిపారు. ఇతర వివరాల కోసం జిల్లా షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా పౌర సంబంధాల అధికారిచే జారీ చేయడమైనది.

# అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ

- టీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ
- నిర్మల్ హర్షం వ్యక్తం చేశారు

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 22**



నిర్మల్ జిల్లాలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేయడం జరుగుతుందని ప్రభుత్వం, యూనియన్ యొక్క ముఖ్య ఆశయమని టీయూడబ్ల్యూజే, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరి రవీందర్,వెంకగారి భూమయ్య స్పష్టం చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి డిపిఆర్ఓ విష్ణువర్ధన్, యూనియన్ నాయకత్వ ఆధ్వర్యంలో జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. మొదటి విడత జాబితాలో ఫస్ట్ లిస్ట్ కార్డులు రాని జర్నలిస్టులు ఎవరూ అధైర్యపడాల్సిన,ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారు పేర్కొన్నారు. వారం రోజుల్లోనే ప్రత్యేకంగా మరో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని, మిగిలిన అర్హులైన వారికి రెండో విడత జాబితా సెకండ్ లిస్ట్ ద్వారా కార్డుల ఇప్పించడంజరుగుతుందన్నారు.కొందరి కార్డులను సాంకేతిక కారణాల వల్ల ప్రస్తుతం పెండింగ్‌లో పెట్టడం జరిగిందని, అంతేకాని ఎవరికీ అన్యాయం జరగదని తెలిపారు. ప్రభుత్వంపై యూనియన్ నిరంతరం ఒత్తిడి తీసుకువచ్చి, నిబంధనల్లో తగిన మార్పులు చేయిస్తూ అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు దక్కేలా విజయం సాధించిందని వారు గుర్తుచేశారు. మొదటి జాబితాలో పేరు లేని మిత్రులు ఎవరూ ఆందోళన చెందవద్దని, రెండో జాబితాలో కచ్చితంగా అర్హులైన వారికి కార్డుల పంపిణీ జరుగుతుందని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య, ఉపాధ్యక్షులు జల్ద మనోజ్, సభ్యులు డిఎస్ మధు, ప్రసాద్,ఈ సందర్భంగా జర్నలిస్టులకు విజ్ఞప్తి చేశారు.

# నీట్ సంక్షోభానికి 'రెండు అంచెల పరీక్ష' ఏకైక శరణ్యం!

## వికేంద్రీకరణతోనే లీక్ మాఫియాకు చెక్



**(కపిల్ వాగ్మారే సిఆర్ కే ప్రజా తీర్పు బైంసా) మే 22**




భారతదేశంలో వైద్య విద్యా ప్రవేశ పరీక్ష చుట్టూ ముసురుకున్న వివాదాలు, ప్రశ్నపత్రాల అక్రమ రవాణా పరంపర దేశంలో విద్యా రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి. ప్రతి ఏటా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును, వారి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని బలితీసుకుంటున్న ఈ కేంద్రీకృత పరీక్షా వ్యవస్థను తక్షణమే పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కేవలం పరీక్షా కేంద్రాల వద్ద భద్రతను పెంచడం వల్లో, కేంద్ర దర్యాప్తు సంస్థల విచారణల వల్లో ఈ వ్యవస్థాగత లోపాన్ని సరిదిద్దలేమని గత దశాబ్ద కాలపు అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే, ప్రస్తుత గందరగోళానికి జాతీయ సాంకేతిక విద్యా ప్రవేశ పరీక్ష తరహాలో 'రెండు అంచెల పరీక్షా విధానం' ఒక అద్భుతమైన, ఆచరణాత్మక పరిష్కారంగా కనిపిస్తోంది. ప్రస్తుత పరీక్షా విధానం ఒక భారీ అక్రమ వ్యాపారానికి కేంద్రంగా మారింది. దేశవ్యాప్తంగా పరిమితంగా ఉన్న ప్రభుత్వ వైద్య స్థానాల కోసం ప్రతి ఏటా దాదాపు ఇరవై రెండు లక్షల మంది విద్యార్థులు పోటీ పడుతుండటంతో, దీని చుట్టూ ఒకఅనారోగ్యకరమైన ఆర్థిక వలయం, శిక్షణాలయాల దందా ఏర్పడ్డాయి. ఒక సగటు అభ్యర్థి ఈ ఒకే ఒక్క పరీక్ష కోసం సంవత్సరాల తరబడి సమయాన్ని, శిక్షణ రుసుముల రూపంలో లక్షలాది రూపాయలను ధారపోస్తున్నాడు. అక్రమార్కులు ఈ బలహీనతను ఆసరాగా చేసుకుని ఒక్కో స్థానాన్ని ముప్పై నుండి యాభై లక్షల రూపాయలకు విక్రయిస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలను నిలువునా ముంచుతున్నారు. ఈ పోటీలో గెలవలేక, పెట్టిన పెట్టుబడులు కోల్పోయి, అటు పాఠశాల విద్య మార్కులకు విలువ లేని ఈ విధానం వల్ల ఎంతో మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఆత్మహత్యలకు శరణుజొచ్చడం దేశానికే తీరని అవమానం. తల్లిదండ్రులు తమ సర్వస్వాన్ని అమ్మి చదివించిన చదువు ఒకే ఒక్క రోజు రాసే మూడు గంటల పరీక్షపై ఆధారపడిపోవడం అత్యంత దారుణమైన విషయం. ఈ ఆర్థిక వినాశనం ఇంతటితో ఆగడం లేదు. దేశవ్యాప్తంగా విద్యార్థులు ఈ పరీక్ష కోసం శిక్షణ రుసుముల రూపంలో పెడుతున్న ఖర్చు కొన్ని వేల కోట్లకు చేరుకుంది. ఇది భారతదేశపు వార్షిక ఆరోగ్య నిధుల కేటాయింపు కంటే కూడా ఎక్కువ కావడం గమనార్హం. ఒక వైపు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు ఇటువంటి ఖరీదైన శిక్షణాలయాలకు వెళ్లలేక వెనుకబడిపోతుంటే, మరోవైపు ధనవంతులు అక్రమంగా సేకరించిన ప్రశ్నపత్రాలను కొనుగోలు చేసి వైద్య స్థానాలను సంపాదిస్తున్నారు. దీనివల్ల ప్రతిభకు గుర్తింపు లేకుండా పోతోంది. ఒక పరీక్ష అభ్యర్థుల నైపుణ్యాన్ని, అర్హతను పరీక్షించాల్సింది పోయి, వారి కుటుంబాల ఆర్థిక స్థితిని బట్టి ఫలితాలను కేటాయించే సాధనంగా మారడం విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. ఈ సంక్షోభాన్ని శాశ్వతంగా అధిగమించడానికి సాంకేతిక విద్యాసంస్థలు అనుసరిస్తున్న రెండు అంచెల నమూనాను వైద్య విద్యా పరీక్షకు కూడా వర్తింపజేయడం ఉత్తమ మార్గం. దీని ప్రకారం, జాతీయ పరీక్షల సంస్థ కేవలం మొదటి విడత వడపోత పరీక్షను మాత్రమే జాతీయ స్థాయిలో నిర్వహించాలి. ఇందులో అర్హత సాధించిన అభ్యర్థులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లేదా రాష్ట్ర వైద్య విశ్వవిద్యాలయాలు తమ స్వంత ప్రశ్నపత్రాలతో రెండవ దశ పరీక్షనూ నిర్వహించుకునేలా పూర్తి అధికారం ఇవ్వాలి. దీనితో పాటు అభ్యర్థి ద్వితీయ సంవత్సర (ఇంటర్మీడియట్) బోర్డు మార్కులకు కూడా ప్రవేశాలలో తగిన ప్రాధాన్యతను కల్పించాలి. ఈ విధానం వల్ల ఒకవేళ జాతీయ స్థాయి ప్రశ్నపత్రం ముందే బయటకు వచ్చినా, దాని విలువ సగానికి పడిపోతుంది. ఎందుకంటే ఒక రాష్ట్రంలో జరిగే అక్రమాలు లేదా లోపాలు మరో రాష్ట్ర అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీయలేవు. పరీక్షల వికేంద్రీకరణ వల్ల అక్రమార్కులకు ఉండే ఆదరణ పూర్తిగా కుప్పకూలుతుంది. ఈ మార్పు కేవలం అక్రమాలను అరికట్టడమే కాకుండా, మన రాజ్యాంగం ఆశించిన సమాఖ్య స్ఫూర్తిని కూడా కాపాడుతుంది. ప్రజారోగ్యం, వైద్య సేవలు అనేవి ప్రాథమికంగా రాష్ట్రాల బాధ్యత అయినప్పుడు, తమ ఆసుపత్రులలో సేవలు అందించే వైద్యులను ఎంచుకునే హక్కు, వారి అర్హతలను నిర్ణయించే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకే ఉండాలి. ఈ కేంద్రీకృత పరీక్ష ప్రవేశపెట్టిన తర్వాత ప్రాంతీయ భాషల్లో చదివిన గ్రామీణ ప్రాంత, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రవేశాలు దారుణంగా పడిపోయాయని, కేవలం కేంద్ర విద్యా విధానంలో చదివి కార్పొరేట్ శిక్షణాలయాలకు వెళ్లిన వారికే వైద్య స్థానాలు దక్కుతున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రెండు అంచెల విధానం ద్వారా రాష్ట్రాలు తమ విద్యా విధానానికి, స్థానిక భాషలకు మరియు సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను తిరిగి పొందుతాయి. ఇది గ్రామీణ విద్యార్థులకు సామాజిక న్యాయం చేకూరుస్తుంది. ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా, పరీక్ష కేంద్రాల్లో సాంకేతిక పరికరాల ద్వారా సంకేతాలను నిలిపివేయడం లేదా కఠిన చట్టాలు తీసుకురావడం వంటి తాత్కాలిక ముసుగులను పక్కన పెట్టాలి. ఒకే ఒక్క పరీక్షపై కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును జూదంగా మార్చడం కంటే, బాధ్యతలను, వికేంద్రీకరించడమే వివేకం. సాంకేతిక విద్య విషయంలో దశాబ్ద కాలంగా అత్యంత విజయవంతంగా, పారదర్శకంగా నడుస్తున్న రెండు అంచెల నమూనాను రాబోయే వైద్య పరీక్షల నుండి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలి. వైద్య విద్యా రంగంలో పారదర్శకతను పునరుద్ధరించడానికి, విద్యార్థులలో కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి తీసుకురావడానికి ఇదొక్కటే ఏకైక మార్గం. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు రానంత కాలం, ప్రతిభావంతులైన వైద్యులను దేశానికి అందించడం సాధ్యం కాదు. వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ 9848559863



## అర్ధరాత్రి వేళ నిఘా మరింత పటిష్టం...

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ..
- జిల్లాలో ఆకస్మికంగా పెట్రోలింగ్ వ్యవస్థను తనిఖీ చేసిన ఎస్పీ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 22.**

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు రాత్రి వేళ నిఘాను మరింత బలోపేతం చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలు, దొంగతనాలు తదితర ఘటనలను అరికట్టేందుకు బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ వాహనాలతో నిరంతర గస్తీ నిర్వహించడంతో పాటు నైట్ బీట్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో నిన్న అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జిల్లా ఎస్పీ గారు జగిత్యాల, కోరుట్ల, మేడిపల్లి ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి పెట్రోలింగ్ విధానాన్ని స్వయంగా పరిశీలించారు. విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రాత్రి సమయంలో సమర్థవంతమైన పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే జిల్లా పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు. సమయానుకూలంగా స్పందిస్తూ నేరాలకు ముందుగానే అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, చట్టవ్యతిరేక చర్యలను నియంత్రించేందుకు రాత్రి నిఘాను మరింత పటిష్టం చేశామని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి అనుమానాస్పద ఘటనలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## 100 రోజుల టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంపై జూమ్ సమీక్ష సమావేశం

**(భూక్య సందీప్, ప్రజాతీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): మే 22**

జిల్లా కార్యాలయం ముందు గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సెంట్రల్ టిబి డివిజన్ వారు నిర్వహిస్తున్న 100 రోజుల టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంపై జూమ్ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం మార్చి 24 నుండి జూలై 5 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా జిల్లాలో టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు 92 హై రిస్క్ గ్రామాలను ఎంపిక చేయగా, ఇప్పటివరకు అందులో 45 గ్రామాలలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సర్వేలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక క్యాంపులకు 7,074 మంది హాజరయ్యారు. మొత్తం 4,698 మందికి స్క్రీనింగ్‌తో పాటు ఛాతీ ఎక్స్-రే పరీక్షలు నిర్వహించారు. అందులో 89 మందిని టిబి వ్యాధిగ్రస్తులుగా గుర్తించి వారికి చికిత్స ప్రారంభించడం జరిగినదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మినిస్ట్రీ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్, ఢిల్లీకి చెందిన అడిషనల్ సెక్రటరీ మాట్లాడుతూ జిల్లాలో మిగిలిన గ్రామాలలో కూడా విస్తృతంగా సర్వేలు నిర్వహించి టిబి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. అలాగే క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని, ప్రత్యేక ఆరోగ్య క్యాంపులను పెంచాలని అధికారులకు సూచనలు మరియు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిబి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, క్వాలిటీ మేనేజర్ శృతి డిపి యు సలిత తదితరులు పాల్గొన్నారు.



## ప్రాచీన పురాతన కట్టడాలు పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత ఎంపీడీవో విగ్నేశ్వర్.

**(వంజరపు) ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) మే 22**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో 99 రోజుల్లో కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల అనుసారం శుక్రవారం ఉదయం ప్రాచీన కట్టడాలు పరిరక్షణ కొరకు అక్కడ పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, మరియు చెట్ల బుష్ కటింగ్ చేశారు. మాసాయిపేట మండలంలో గల బైనూరు గుడి దగ్గర ఉన్న బురుజు సుమారు 100 సంవత్సరాల పురాతను కాలంది, జామా మజీద్, హకీంపేట్ హల్దీ డ్యాం అధికారులు సందర్శించి ఉపాధి హామీ కూలీల చేత పరిశు భ్రపరచారు. పర్యాటక రంగాన్ని పెంపొందించిందికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విగ్నేశ్వర్, సర్పంచ్ వీరన్న గారి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పసుల వెంకటేశం, సెక్రెటరీ రాణి, ఎంపీ ఓ నరేష్, ఉపాధి హామీ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోళ్ల ఫారమ్ దగ్ధం...

### సుమారు రూ. 8 లక్షల ఆస్తి నష్టం...

**ఎల్లారెడ్డిపేట, మే 22 (ప్రజా తీర్పు)**

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక కోళ్ల ఫారమ్ పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో ఫారమ్‌లోని సామగ్రితో పాటు వందలాది కోళ్లు సజీవ దహనమయ్యాయి. అగ్రహారం గ్రామానికి చెందిన ఆంజనేయులు ఈ కోళ్ల ఫారమ్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగి వేగంగా విస్తరించాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, అప్పటికే ఫారమ్ పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ. 8 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆంజనేయులు కన్నీటి పర్యంతమయ్యారు.

# జిల్లాను రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

- అధికారుల - ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే ప్రజా పాలన విజయవంతం

**(భూక్య సందీప్ , ప్రజాతీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) మే 22**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా స్థాయి సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించగా, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దొడ్డ కిరణ్ మిత్ర, భద్రాచలం ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన, సంక్షేమ, అభివృద్ధి ప్రదర్శన స్టాల్స్‌ను పరిశీలించారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, క్షేత్రస్థాయిలో చేపడుతున్న కార్యక్రమాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు తమ శాఖల ద్వారా అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో చేపట్టిన కార్యక్రమాలు, ప్రత్యేక డ్రైవ్‌లు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు, ప్రజా సమస్యల పరిష్కార చర్యలపై సమగ్రంగా వివరించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పారదర్శక పాలన అందించాలనే లక్ష్యంతో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. కార్యక్రమం ప్రారంభ దశలో జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, సంక్షేమ వారోత్సవాలు, ఆరోగ్య శిబిరాలు విస్తృత స్థాయిలో చేపట్టినట్లు తెలిపారు. గ్రామపంచాయతీలు, మండలాలు, మున్సిపాలిటీల స్థాయిలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నాయని అన్నారు . అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమిష్టిగా పని చేస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను రోల్ మోడల్ జిల్లాగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రతి శాఖ బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేసే గొప్ప కార్యక్రమమన్నారు. ఏ ప్రభుత్వం అయినా తమ విధానాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలంటే ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంకితభావంతో పని చేస్తే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు .ప్రతి శాఖ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా వివిధ శాఖల, ప్రజా ప్రతినిధుల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలపై స్పష్టమైన అవగాహన ఏర్పడిందన్నారు. జూన్ 12న నిర్వహించనున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక ముగింపు ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. మహాలక్ష్మి పథకం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను ప్రజలకు సమర్థవంతంగా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిరంతర పర్యవేక్షణతో పని చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ఆదర్శ జిల్లాగా నిలిపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. అయితే ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు ప్రజలకు మరింత చేరువ అవుతున్నాయని అన్నారు . దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయని విధంగా తెలంగాణ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా పని చేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూలి ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 65 డివిజన్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గిరిజన జిల్లా అభివృద్ధిలో అన్ని శాఖల భాగస్వామ్యం అవసరమని, శాఖల సమన్వయంతోనే ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. అనంతరం సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, అన్ని శాఖల జిల్లా అధికారులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ సమావేశాలు

- వి.కే.సి.ఎం మైన్ , ఏరియా స్టోర్స్ , వి.టి.సి, సివిల్ రుద్రంపూర్ డిస్పెన్సరీ విభాగాలలో మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ సమావేశాలు

**(భూక్య సందీప్ , ప్రజాతీర్పు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా): మే 22**



శుక్రవారం న కొత్తగూడెం ఏరియా లో మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ నిర్వహిస్తున్న సమావేశాలలో భాగంగా ఉదయం 7 గంటలకు వికేసిఎం ఐ ఏరియా స్టోర్స్ నందు మధ్యాహ్నం 3గంటలకు సివిల్, ఎస్ఎపిసి, డిస్పెన్సరీ ఎంవిటిసి డిపాఎర్ట్మెంట్ లకు ఎంబిటిసి నందు మల్టీ డిపార్ట్మెంటల్ టీమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు సంస్థ యొక్క ప్రస్తుత పరిస్థితులు, బహిరంగ మార్కెట్లో నెలకొన్న పోటీ, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో విధులు నిర్వహించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గతంలో సాధించిన ఘన విజయాలను స్ఫూర్తిగా తీసుకుని, నాణ్యమైన ఉత్పత్తి సాధనకు కృషి చేయాలని సూచించారు.సమావేశాలలో ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల వినియోగం, ఆర్థిక వ్యవహారాలు, లాభనష్టాలు, నాణ్యత, రక్షణ, సంక్షేమ కార్యక్రమాలు వంటి అంశాలపై అధికారులు వివరించారు. సంస్థ ఎదుర్కొంటున్న సవాళ్లు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలు,గనుల పరిస్థితులు పోటీ పరిస్థితులపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.ఉత్పత్తి ప్రక్రియలో ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించి, విధుల పట్ల నిబద్ధతతో పని చేయాలని సూచించారు. సమయపాలన, రక్షణ నియమాల పాటింపు సమర్థవంతమైన పనితీరుతో అధిక ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. ప్రతి ఉద్యోగి రెగ్యులర్‌గా విధులకు హాజరవుతూ ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని, సంస్థ అభివృద్ధే ఉద్యోగుల భవిష్యత్‌కు బలమని వివరించారు. ఉత్పత్తి పెంపుతో పాటు నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించడం ద్వారా మార్కెట్లో సింగరేణి బొగ్గుకు మరింత ఆదరణ లభిస్తుందని పేర్కొన్నారు.మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశం యొక్క ఉద్దేశమును సింగరేణి సంస్థ యొక్క ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీ పనితనం, ఉత్పత్తి వ్యయం ఉద్యోగుల సంక్షేమ కొరకు సింగరేణి సంస్థ తీసుకుంటున్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హాజరైన ఉద్యోగులందరికీ వివరించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రాజెక్టు ఆఫీసర్ నరసింహారావు,ఏజిఎంఎం (ఫైనాన్స్) బీబత్స డి.జి.ఎం. (ఐఈడి) యోహాన్ .ఎస్.ఈ) నాగబుషణం, డిజిఎం (ఏరియా స్టోర్స్) లక్ష్మణమూర్తి , వికేసిఎం మేనేజర్ మురళి, ప్రాజెక్టు ఇంజనీర్ హారిప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎల్ .తిరుపతి ,వీ.టి.సి మేనేజర్ లక్ష్మణ్ ,ఏరియా సేఫ్టీ ఆఫీసర్ అభిలాష్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఐఈడి) వి.మణి (ఏఐటిషయూసి) పిట్ సెక్రెటరీ ఎం.ఆర్.కే ప్రసాద్ , (ఐ.ఎన్.టి.యూ.సి) పిట్ సెక్రెటరి గోపు కుమార్ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## బోడుప్పల్‌లో గ్యాస్ మాఫియాపై టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి

- అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గుట్టురట్టు.. 55 సిలిండర్లు స్వాధీనం
- అక్రమంగా కమర్షియల్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్.
- నివాస ప్రాంతంలోనే ప్రమాదకర గ్యాస్ వ్యాపారం,ఒక్కసారిగా దాడి చేసిన అధికారులు.

**:బోడుప్పల్ సర్కిల్ / మే 22 : ( ప్రజాతీర్పు )**

మల్కాజిగిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బోడుప్పల్ సర్కిల్ లో అక్రమంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గ్యాస్ మాఫియాపై టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ డి.ఎస్.పి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో భారీగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు.బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ అరవింద ఎన్‌క్లేవ్ రోడ్ నెంబర్--02 ప్రాంతంలో అక్రమంగా కమర్షియల్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న వ్యక్తిని స్థానిక మేడిపల్లి పోలీసుల సహకారంతో అధికారులు పట్టుకున్నారు. దాడి సమయంలో అధికారులు మొత్తం 55 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నివాస ప్రాంతంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు లేకుండా గ్యాస్ రీఫిల్లింగ్ నిర్వహించడం వల్ల భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఈ అక్రమ వ్యాపారం ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం కలుగుతోందని, ప్రజల ప్రాణ భద్రతను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. నిందితుడిపై అవసరమైన కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.ఈ దాడిలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నారా ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## అక్రిడిటేషన్ కార్డులు అందరికీ అందేలా వేగవంతం చర్యలు..

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో తీర్మానం.
- నవంబర్‌లో వార్షికోత్సవ సభ నిర్వహణకు ప్రత్యేక కమిటీ

**హైదరాబాద్, మే 22, (ప్రజా తీర్పు):**

తెలంగాణ ఎస్సీ, ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం శుక్రవారం సికింద్రాబాద్ లోని పద్మిని హోటల్ లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి హాజరైన జర్నలిస్టులు పలు కీలక అంశాలపై చర్చించి ముఖ్య నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు కట్కూరు మల్లేష్, ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలిపారు.రాష్ట్ర కార్యాలయాన్ని ఏర్పాటు చేయడం, అక్రిడిటేషన్ కమిటీల్లో అసోసియేషన్ ప్రతినిధులకు స్థానం కల్పించడం, రాష్ట్ర కమిటీలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టు వివరాలను సేకరించడం వంటి అంశాలపై సమావేశంలో తీర్మానాలు చేశారు. జిల్లాల వారీగా సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు. నవంబర్‌లో నిర్వహించనున్న వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ ఆహ్వాన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా ఎల్ల సంతోష్ కుమార్, వైస్ చైర్మన్‌గా ఇడపాక సురేష్ కుమార్, కోశాధికారిగా నెమ్రాది వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కోసినోల్ల అరుణ్‌ను నియమించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు కాదేపురం గంగన్న,రాష్ట్ర నాయకులు డా, దుర్గం నగేష్, కుంటోల్ల వెంకటస్వామి, ఈరోళ్ల పురుషోత్తం,చుంచు బాబు,తెడ్డు సాయిలు, మహేందర్, ఈ సురేష్,వెంకన్న, సాయిరాం ఈదునూరి మహేష్ తోపాటు,వివిధ జిల్లాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## బోడుప్పల్‌లో గ్యాస్ మాఫియాపై టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి.

- అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గుట్టురట్టు.. 55 సిలిండర్లు స్వాధీనం
- అక్రమంగా కమర్షియల్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్.
- నివాస ప్రాంతంలోనే ప్రమాదకర గ్యాస్ వ్యాపారం,ఒక్కసారిగా దాడి చేసిన అధికారులు.

**:బోడుప్పల్ సర్కిల్ / మే 22 : ( ప్రజాతీర్పు )**

మల్కాజిగిరి కమిషనరేట్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బోడుప్పల్ సర్కిల్ లో అక్రమంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న గ్యాస్ మాఫియాపై టాస్క్ ఫోర్స్ అధికారులు మెరుపుదాడి నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ డి.ఎస్.పి రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో భారీగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు.బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శ్రీ అరవింద ఎన్‌క్లేవ్ రోడ్ నెంబర్--02 ప్రాంతంలో అక్రమంగా కమర్షియల్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్న వ్యక్తిని స్థానిక మేడిపల్లి పోలీసుల సహకారంతో అధికారులు పట్టుకున్నారు.దాడి సమయంలో అధికారులు మొత్తం 55 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. నివాస ప్రాంతంలో ఎటువంటి భద్రతా ప్రమాణాలు లేకుండా గ్యాస్ రీఫిల్లింగ్ నిర్వహించడం వల్ల భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ అక్రమ వ్యాపారం ద్వారా ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం కలుగుతోందని, ప్రజల ప్రాణ భద్రతను కూడా ప్రమాదంలోకి నెడుతున్నారని అధికారులు పేర్కొన్నారు. నిందితుడిపై అవసరమైన కేసులు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.ఈ దాడిలో అసిస్టెంట్ సివిల్ సప్లై ఆఫీసర్ సంధ్య, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నారా ప్రభాకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను బదిలీ చేయాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్ల పెల్లి యుగంధర్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 22**



కరీంనగర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖలో జిల్లా సంక్షేమ అధికారి, ఇతర అధికారులపై ఏసీబీ విచారణ కొనసాగుతున్నందున ఈ పరిస్థితిలో సంబంధిత అధికారులను అదే స్థానంలో కొనసాగించడం వల్ల సాక్ష్యాధారాలను తారుమారు చేసే అవకాశం ఉండటమే కాకుండా, శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై ఒత్తిడి, వేధింపులు పెరిగే ప్రమాదం ఉన్నదని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి భావడ్లపల్లి యుగంధర్ ఆరోపించారు. గతంలో కూడా జిల్లా సంక్షేమ అధికారిపై శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు వేధింపుల గురించి అప్పటి జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదులు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. అలాగే శాఖలో పనిచేస్తున్న కొంతమంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వేధింపులు భరించలేక గతంలో రాజీనామా చేసి వెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశంలో పోషణ అభియాన్ విభాగంలో పనిచేస్తున్న ఒక మహిళా ఉద్యోగిని అంగన్వాడీ టీచర్లు, మండల అధికారుల సమక్షంలో అవమానకరంగా దూషించడంతో ఆమె మానసికంగా తీవ్రంగా బాధపడి ఉద్యోగానికి రాజీనామా చేయవలసిన పరిస్థితి ఏర్పడిశీదని పేర్కొన్నారు. జిల్లా సంక్షేమ అధికారిపై గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్టు తెలిపారు. కావున ప్రస్తుతం ఏసీబీ విచారణ ఎదుర్కొంటున్న అధికారులను వెంటనే బదిలీ చేసి, విచారణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరారు. అలాగే శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు రక్షణ కల్పించి, భయభ్రాంతులకు గురికాకుండా బాధ్యత వహించాలని ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో యుగేందర్ విజ్ఞప్తి చేశారు.

## వడ్ల కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి

**హుస్నాబాద్ మే 22 ప్రజాతీర్పు**



బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు హుస్నాబాద్ లో స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తరుగు, తేమ లేకుండా కొనుగోలు చేయాలని రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు . కొన్ని గ్రామాలలో లారీలు అందుబాటులో లేకపోవడం వలన రైతులు తమసొంత ట్రాక్టర్ల పై వడ్లను తీసుకెళు న్న రైతులకు ఇబ్బంది అవుతుంది కావున ఎక్కువ మొత్తంలో లారీలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏ ఇబ్బంది కలిగినా బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట మల్లయ్య, బైరి అరుణ్, నెల్లి శ్రీనివాస్, మెరుగు రవి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ది అత్యుత్సాహం

- విచారణను ప్రభావితం చేసేలా మాట్లాడడం సరికాదు.
- బీజేపీ మాజీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి.

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 22**



బిఆర్ఎస్ పార్టీలో ఉనికి కోసం ఆ పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అతిగా ప్రవర్తిస్తున్నారని, ప్రధానంగా పోక్సో కేసు విషయంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అతి ఉత్సాహం మితిమీరిపోయిందని తిమ్మాపూర్ మండల బిజెపి మాజీ అధ్యక్షులు న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి ధ్వజమెత్తారు. ఆయన చేస్తున్న వాదనలు , స్టేట్మెంట్స్ విచారణను ప్రభావితం చేసేలా ఉన్నాయని, ఇకనైనా ప్రవీణ్ కుమార్ అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని జగదీశ్వరాచారి అన్నారు. బండి భగీరథ్ పై పోక్సో కేసు నమోదైన సందర్భంగా భాధితుల కంటే ఎక్కువగా స్పందిస్తున్న ప్రవీణ్ కుమార్ వ్యవహార శైలిపై శుక్రవారం జగదీశ్వర చారి స్పందించి మాట్లాడారు. ప్రవీణ్ భాధితుల కోసం కాకుండా కేవలం తన రాజకీయ మైలేజీ కోసమే మాట్లాడుతున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. తెలంగాణలో ఎంతో మంది మైనర్ బాలికలు, మహిళలు అత్యాచారానికి గురైనప్పుడు ఏ మాత్రం స్పందించని ప్రవీణ్ ఇంతలా స్పందించడంలో కారణమేందని ప్రశ్నించారు . భగీరథ్ పై నమోదైన కేసు విషయంలో వాస్తవాలు వెల్లడయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించిందని తెలినప్పటికీ, ఇష్టమొచ్చిన రీతిలో మాట్లాడటం సమంజసం కాదని అన్నారు. కోర్టులో ఉన్న అంశాన్ని మీడియా ముందు మాట్లాడటమనేది సబ్ జ్యూడిస్ మ్యాటర్ అవుతుందని తెలిసి కూడా ఇలా ప్రవర్తించడం రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధం కాదా అని ప్రశ్నించారు. భాధితులకు సంబందించిన ఆదారాలేమైనా ఉంటే సిట్ కు అప్పగించాలి కానీ ప్రతీరోజు మీడియా సమావేశం నిర్వహించి, గోప్యంగా జరుగుతున్న విచారణను ప్రభావితం చేసేలా మాట్లాడటం కరెక్ట్ కాదని ప్రవీణ్ కు సూచించారు. వాస్తవాలను వెలికితీసే పోలీస్ వ్యవస్థ , న్యాయవ్యవస్థ ఉన్నప్పటికీ, సోషల్ మీడియా ద్వారా, ప్రెస్ మీట్ ల ద్వారా అవాస్తవాలను ప్రచారం చేయడం కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ నాయకులైన బండి సంజయ్ పై కక్ష సాధింపు చర్యేనని పేర్కొన్నారు.పోక్సో వంటి సున్నితమైన చట్టాన్ని రాజకీయ లాభాల కోసం వాడుకోవడమనే బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆలోచనలను న్యాయ వ్యవస్థ గమనిస్తుందని అన్నారు.కొడుకు తప్పు చేసినట్లుగా చూపించే కేసులో తండ్రిని ముద్దాయిగా చూపాలనుకోవడమనేది వ్యక్తిగత నేర భాద్యత అనే రాజ్యాంగ సూత్రానికి విరుద్ధమని అన్నారు.విచారణ పూర్తి కాకముందే రాజకీయ తీర్పులివ్వడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు.బహుజన రాజ్యాధికారమే లక్ష్యమని రాజకీయాల్లో ప్రవేశించి, దేవుళ్లను పూజించవద్దని, అగ్రవర్ణాలతో అంటకాగరాదని తప్పుడు ప్రచారాలు చేసి బడుగు బలహీన వర్గాలకు చెందిన దళితులను, బహుజనులను విడదీసే ప్రయత్నం చేసిన చరిత్ర ప్రవీణ్ కుమార్ దని విమర్శించారు. గతంలో బీఎస్పి లో ఉన్నప్పుడు కేసీఆర్ ను, కేటీఆర్ ను తిట్టి మళ్ళీ అదే పార్టీ లో బానిస బతుకుతున్న ప్రవీణ్ కు విశ్వసనీయత లేదని అన్నారు.భగీరథ్ కేసులో ప్రవీణ్ కుమార్ అత్యుత్సాహన్ని తగ్గించుకొని రాష్ట్రం లో జరుగుతున్న ఎన్నో అన్యాయాలపై స్పందించి భాదితులకు న్యాయం చేసే మేధావి గా ఉండాలే తప్ప,బీఆర్ఎస్ పార్టీ కి బానిస గా మారొద్దని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

# విద్య తోనే సమాజ అభివృద్ధి





- లక్ష్య సాధన తో అనుకున్న గమ్యానికి చేరాలి
- పదవ తరగతి విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు బైంసా) మే 22**

విద్య తోనే సమాజ అభివృద్ధి జరుగుతుందని, విద్యార్థులు చదువులో రాణించి అనుకున్న గమ్యానికి చేరుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు. శుక్రవారం బైంసాలోని ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో అనసూయ పవార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.పదవ తరగతిలోప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, మెమొంటోను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు.విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకే గత కొన్ని సంవత్సరాలుగా అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. పేద విద్యార్థులు చదువుల్లో ప్రతిభ కనబరిచి, వారు ఉపన్యాసాలు ఇస్తుంటే ఎంతోసంతోషం అనిపించిందన్నారు.కుటుంబంలో ఒకరు విద్యావంతులైతే ఆ కుటుంబమే,బాగుపడుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఎంత ఎత్తుకు ఎదిగిన తల్లిదండ్రులను, విస్మరించవద్దన్నారు.విద్యా వైద్యం సాగునీరు లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నానని, విద్యాభివృద్ధికి పాటుపడతానని ఆయనఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమానికి నియోజకవర్గం లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుండి విద్యార్థులు రావడంతో,ఎస్ ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ జనసంద్రమైంది. విద్యార్థులతో పాటు,వారి తల్లిదండ్రులను సైతం ఎమ్మెల్యే అభినం దించారు. ఈసందర్భంగా ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు,విద్యార్థులు మాట్లాడుతూ అనసూయ పవర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం, అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడలేని విధంగా ప్రతి సంవత్సరం విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించడం మంచి పరిణామం అన్నారు. అనసూయ పవర్ ట్రస్ట్,ఎస్.ఎస్. స్టడీ సర్కిల్ ద్వారా నియోజకవర్గంలో వందలాది మంది యువతకు ఉద్యోగాలు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడ లేని విధంగా ఎమ్మెల్యే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ రాజేష్ బాబు తో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తాం..

- తిరుమలాపూర్ లో నూతన ట్రాన్స్ పార్మార్ , బోరు బావిని ప్రారంభించిన మంత్రి అడ్లూరి..

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) మే 22**



వరి మొక్కజొన్న పండించిన రైతులు ఆందోళన చెందవద్దని జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యం మొక్కజొన్నను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని ఆ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం గొల్లపెల్లి మండలం తిరుమలపూర్ గ్రామంలోని ధాన్యము కొనుగోలు కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన ట్రాన్స్ ఫార్మర్, బోరు బావిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ఈరబీ సీజన్ లో పెద్ద మొత్తంలో వరి, మొక్కజొన్న దిగుబడులు వచ్చాయని అన్నారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని జిల్లాలో పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని మంత్రి ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు. జగిత్యాల జిల్లాలో ఇప్పటికే 2.61లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని ఆయన మిగిలిన ధాన్యం కొనుగోలు చేయడానికి నిత్యం అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ ఎక్కడ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వంలో పనిచేస్తున్న తాము సమస్యలను చూసి పారిపోయే పరిస్థితి లేదని సమస్య పరిష్కారం అయ్యే వరకు ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. తిరుమలాపూర్ గ్రామ రైతులు ఐక్యతతో సొసైటీని ఏర్పాటు చేసుకోవడమే కాకుండా ధాన్యము కొనుగోలుకు రైతులు సమిష్టిగా నిధులు సేకరించి స్థలం కొనుగోలు చేసినందుకు మంత్రి అభినందించారు. తిరుమలాపూర్ గ్రామంలో సమస్యల పరిష్కారానికి తన వంతుగా సహకరిస్తానని రాజకీయాలకు అతీతంగా గ్రామస్తులు సహకరించాలని మంత్రి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కాసా అంజలి గంగాధర్.మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్. వైస్ చైర్మన్ పూరపాటు రాజిరెడ్డి .కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రాపల్లి గంగన్న .పార్టీ జనరల్ సెక్రెటరీ జెల్లా అనిల్ .సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు దాసరి తిరుపతి,సర్పంచులు కుల గాని శ్రీలత గంగా చారి.మేక స్వామి వారు.పావని దస్తగిరి. గంగరాజం.ఉప సర్పంచ్లు బుచ్చి రెడ్డి. గంగాధర్ ఇతర పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## జనగణనలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు: డిప్యూటీ కమిషనర్ బి.వెంకట్ రామ్

**(వైయాదగిరి ప్రజా తీర్పు మహేశ్వరం రిపోర్టర్)మే.22**

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జల్ పల్లి లో.. డిప్యూటీ కమిషనర్ బి వెంకట్ రామ్ జనగణన కార్యక్రమంలో సూపర్వైజర్లు,ఎన్యూమరేటర్ల పాత్ర ఎంతో కీలకమని డిప్యూటీ కమిషనర్ మరియు ఛార్జ్ అధికారి బి.వెంకట్ రామ్ తెలిపారు.జనగణనలో భాగంగా ప్రతి ఎన్యూమరేటర్ తప్పనిసరిగా ప్రతి గృహాన్ని సందర్శించి వివరాలను పారదర్శకంగా సేకరించాలని,ఆ సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని సూచించారు.జల్పల్లి సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ,ఎన్యూమరేటర్లు సేకరించిన సమాచారాన్ని సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు పరిశీలించి నిర్ధారించాలని ఆదేశించారు.ప్రజలందరూ జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని,వారు అందించే సమాచారం దేశ భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు.ప్రతి ఎన్యూమరేటర్ రోజుకు కనీసం 40 గృహాల వివరాలు నమోదు చేయాలని,ప్రభుత్వం నిర్దేశించిన గడువు జూన్ 9 లోపు జనగణన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బి.వినయ్ కుమార్,ఫీల్డ్ ట్రైనర్ విజయ్ భాస్కర్ రెడ్డి,సిబ్బంది మధుసూదన్ రెడ్డి,శాంతి కుమార్ ,అభిరామ్, లోకేష్, నవీన్ పాల్గొన్నారు.



## యూసీఎఫ్ నిధులు మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి, మంత్రులకు కృతజ్ఞతలు

- వైద్యుల అంజన్ కుమార్ కార్పొరేటర్, కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు కరీంనగర్

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) మే 22**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అర్బన్ ఛాలెంజ్ ఫండ్స్ మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ ,రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అర్బన్ డీసీసీ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నేడు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసినారు.అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ముగిసినప్పటికీ కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా 70 కోట్ల రూపాయలను మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వాటా పోను, రాష్ట్ర ప్రభుత్వ వాటా, హడ్కో రుణం కలిపి మొత్తం 630 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వమే భరించడానికి సిద్ధపడడం హర్షణీయమని అన్నారు. కరీంనగర్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రికి,మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కేంద్రం నుండి నిధులు మంజూరుకు సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు కూడా కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరీంనగర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పట్టణాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి పనులు చేపడుతోందని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వరాల నరసింగం పడిశెట్టి వసంత భూమయ్య సరైన ప్రసాద్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డి పర్వతం మీసాల మల్లేశం గంట కళ్యాణి శ్రీనివాస్ నాయకులు మడుపు మోహన్ కుంభాల రాజ్ కుమార్ అహ్మద్ అలీ వంగల విద్యాసాగర్ మహమ్మద్ ఇమ్రాన్ అబ్దుల్ రెహమాన్ ఇమ్రాన్ ఘని వేణు పాల్గొన్నారు.



## లక్ష్మీనగర్‌లో పారిశుధ్యం, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి వ్యాపారులు సహకరించాలి

- రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సూచన
- వ్యాపార సంస్థల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం

**గోదావరిఖని, మే 22, (ప్రజాతీర్పు):**

ప్రధాన వ్యాపార కేంద్రంగా ఉన్న లక్ష్మీనగర్‌లో పారిశుధ్యం, పార్కింగ్ సమస్యల పరిష్కారానికి వ్యాపారులు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. శుక్రవారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వ్యాపార సంస్థల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ లక్ష్మీనగర్‌లో రోజుకు రెండు పూటలా పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నప్పటికీ కొంతమంది మళ్లీ రోడ్లపై చెత్త వేస్తున్నారని అన్నారు. ప్రతి దుకాణం ఎదుట చెత్త బకెట్లు ఏర్పాటు చేసి అందులోనే చెత్త వేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్ చొరవతో రూ.34 కోట్ల వ్యయంతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టి విశాలమైన రహదారులు నిర్మించినప్పటికీ, దుకాణాల బయట మెటీరియల్ ఉంచడం, వాహనాలను రోడ్లపైనే పార్క్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. లక్ష్మీనగర్‌లో మూడు ప్రాంతాల్లో ప్రత్యేక పార్కింగ్ స్థలాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. పార్కింగ్ నియంత్రణ కోసం మార్కింగ్ లైన్లు వేయాలని, మున్సిపల్ చెత్త వాహనాలు వచ్చినప్పుడు సమాచారం అందించేందుకు మైక్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని వ్యాపారులు కోరారు. వ్యాపార అభివృద్ధికి నగర పాలక సంస్థ మరింత సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వ్యాపారులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణశ్రీ, ట్రాఫిక్ సీఐ రాజేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, టీపీఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, కార్పొరేటర్లు మేకల సమ్మయ్య, చిదురాల నాగరాజు, ముస్తఫా, ధూళికట్ట సతీష్, నాయకులు రాజేందర్, మహేష్, అశోక్‌రావు, రాజేష్ శర్మ, రామస్వామి, సారయ్య, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరంలో అభివృద్ధి పై సబితా ఇంద్రారెడ్డి చర్చకు సిద్ధమా కాకి ఈశ్వర్ ముదిరాజ్ డిమాండ్

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) మే.22**



మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ సబితా ఇంద్ర రెడ్డి సిరిగిరి పురం గ్రామం లో రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శించడం తప్పు అని ఆయన అన్నారు గత రెండు సంవత్సరాల నుండి మహేశ్వరం గ్రామంలో 2 కోట్ల 50 లక్షలు రూపాయలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సహకారంతో ఎస్ డి ఎఫ్, హెచ్ ఎం డి ఏ, ఇతర సంక్షేమ పథకాల ద్వారా అభివృద్ధి పనులు సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఐమాక్స్ లైట్లు, పాఠశాల ప్రహరీ గోడ, తదితర పనులు చేశామన్నారు. ఈ యొక్క పనులు సబిత ఇంద్రారెడ్డికి కనబడుటలేదని ఘాటుగా విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి, రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇవన్నీ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయని ప్రజలు రైతులు యువకులు కాంగ్రెస్ పాలనలో సంతోషంగా ఉండటం వీరికి ఇష్టం లేక ముసలి కన్నీరు కారుస్తున్నారని వీరి మాటలు నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని కాకి ఈశ్వర్ ముదిరాజ్ జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధం మా అని సవాలు విరిసిరారు సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గంలో ఆమె కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై గెలిచి మూడుసార్లు మంత్రి పదవి అనుభవించి ఈరోజు బిఆర్ఎస్ పార్టీ లో చేరి మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ తరపున మరొక్కసారి కాంగ్రెస్ పాలను విమర్శించకూడదని హెచ్చరిస్తున్నాము.

## అష్మిత నిష్క్రమణ

మలేషియా మాస్టర్స్ టోర్నీలో భారత యువ షట్లర్ అష్మిత చాలిహా పోరాటం ముగిసింది. సహచరులు నిష్క్రమించినా..అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న అష్మిత క్వార్టర్స్‌లో పోరాడి ఓడింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో అష్మిత 23-21, 18-21, 11-21తో లీన్ హాజ్‌మార్క్ జెర్ఫెల్డ్(డెన్మార్క్) చేతిలో ఓటమిపాలైంది.

## టాపర్‌ను పడగొట్టినా.. థర్డ్ ప్లేసే.. ఆఖరాటలో దంచికొట్టిన సన్‌రైజర్స్

నువ్వు ఫోర్ కొడితే నేను సిక్స్ కొడతా అన్నట్టు సొంతగడ్డపై ఆఖరాటలో సన్‌రైజర్స్ బ్యాటర్లు దంచికొట్టాడు. ఆర్సీబీ బౌలింగ్‌ను ఉతికేస్తూ పరుగుల మోతతో ఉప్పల్ స్టేడియాన్ని ఊపేశారు. దాంతోలీగ్‌లో మరే జట్టుకు సాధ్యంకాని రీతిలో హైదరాబాద్ ఆరోసారి 250 ప్లస్ స్కోరు చేసింది. ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో తమను ఓడించిన బెంగళూరుపై గెలిచి ప్రతీకారం తీర్చుకుంది. అయినా టాప్-2లో నిలిచేంత భారీ విజయం సాధించలేకపోయిన సన్‌రైజర్స్ మూడో స్థానంతో సరిపెట్టింది. ఆఖరాటలో ఓడినా.. మెరుగైన రన్‌రేట్‌తో ఆర్సీబీ టాప్ ప్లేస్ నిలబెట్టుకుంది.

## వరి కోత మిషన్‌లో పడి చనిపోయిన కొండచిలువ..

అక్కన్నపేట మండలం మల్ చెరువుతండాలో ఘటన

**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ 22 ప్రజా తీర్పు**



అక్కన్నపేట మండలం మల్ చెరువుతండాలోని ఓ వరి పొలంలో కొండచిలువ ప్రత్యక్షమైంది. వరి కోత మిషన్‌తో కోతలు నిర్వహిస్తుండగా కొండచిలువ మిషన్‌లో పడి చనిపోయింది. రైతు బానోతు అనిల్‌కు చెందిన పొలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చనిపోయిన కొండచిలువను చూసేందుకు చుట్టుపక్కల రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆసక్తిగా పరిశీలించారు. తండా పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు కనిపించడం సాధారణ విషయమేనని స్థానికులు తెలిపారు.

# కోరపల్లి రోడ్డుపై దోపిడీ కలకలం..

- 24 గంటల్లోనే నిందితుల అరెస్ట్
- 8 మంది నిందితుల అదుపులోకి
- నగదు, బంగారం, వాహనాల స్వాధీనం

**జమ్మికుంట మే 22 ప్రజాతీర్పు**



కోరపల్లి గ్రామ రహదారిపై జరిగిన దోపిడీ ఘటనను జమ్మికుంట పోలీసులు 24 గంటల్లోనే ఛేదించి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు హుజురాబాద్ ఏసీపీ వి. మాధవి తెలిపారు. జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20 రాత్రి కోరపల్లి గ్రామం వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం ను 11 మంది గుర్తుతెలియని వ్యక్తులు అడ్డగించారు. వాహనంలో ఉన్న ఇద్దరు వ్యక్తులపై దాడి చేసి, వారిని ఎఫ్‌సీఐ గోదాం సమీపంలోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారు.నిందితులు బాధితుల వద్ద నుంచి నగదు, అర తులం బంగారం ఉంగరం దోచుకోవడంతో పాటు ఫోన్‌పే ద్వారా సుమారు రూ.38 వేల వరకు బలవంతంగా వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మరో లక్ష రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి చేస్తూ బాధితులను రైల్వే స్టేషన్ వైపు తీసుకెళ్తుండగా, వారు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. దీంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.ఘటనపై సమాచారం అందుకున్న జమ్మికుంట పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. మే 21 ఉదయం సైదాబాద్ ఎక్స్‌రోడ్--కోరపల్లి ప్రాంతంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఎనిమిది మందిని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించినట్లు ఏసీపీ తెలిపారు.నిందితుల వద్ద నుంచి రూ.14 వేల నగదు, అర తులం బంగారం ఉంగరం, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో పల్లపు ఈశ్వర్ అలియాస్ బన్నీ, పల్లపు అశోక్, ఎలకపల్లి ప్రమోద్, చుక్కారపు అఖిలేష్, మొగుళ్ల రాకేష్, పల్లపు మహేష్, పల్లపు మహేష్ , తప్పేలా వంశీ ఉన్నారని తెలిపారు.ఈ కేసులో పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఏసీపీ మాధవి పేర్కొన్నారు.

## నారాయణ విద్యార్థికి ఎమ్మెల్యే పవార్ రామారావు సన్మానం

**(కపిల్ వాగ్మారే సిఆర్ కే,ప్రజా తీర్పు భైంసా) మే 22**



భైంసా పట్టణంలోని వినాయక నగర్ లో గల నారాయణ పాఠశాలలో చదువు తున్న పదవ తరగతి విద్యార్థి శ్రావణి పాటిల్ ఇటీవల జరిగిన పదవ తరగతి పరీక్షల్లో మంచి మార్కు సాధించి 600 గాను 582 మార్కులతో ముధోల్ నియోజకవర్గం లో ప్రథమ స్థానంలో నిలిచినారు అలాగే నారాయణ స్కూల్లో చదువుతున్నటువంటి రామ్ చరణ్ అనే విద్యార్థి 580 మార్కులు సాధించి ముదురు నియోజకవర్గంలో ద్వితీయ స్థానంలో నిలిచినారు. ముధోల్ నియోజకవర్గం స్థాయిలో ప్రథమ మరియు ద్వితీయ స్థానాల్లో నిలిచినటువంటి,విద్యార్థులకు అనసూయ పవర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గౌరవరామారావు పటేల్,గారిచేత ఘనంగా సన్మానించినారు.ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, మాట్లాడుతూభవిష్యత్తులో బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో ఉండాలని విద్యార్థులకు సూచించారు అలాగే,మంచి మార్కులతో ప్రతిభ కనబరచడం పట్ల భైంసా మండల్ విద్యాశాఖ అధికారి సుభాష్ సార్ గారు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను దీవించారు. అదేవిధంగా నారాయణ పాఠశాల ఆదిలాబాద్ జోన్ ఏజీఎం ప్రసాద్ సార్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభు, ఏవో గజ్జరం, మరియు ఉపాధ్యాయుల బృందం విద్యార్థులను అభినందించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020